సంపుటి 12 సంచిక 5 జులై - ఆగస్టు 2024

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-12 Issue-5
వెల : రూ. 20/-



# నిర్యాణము



## కీ.శే. శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గారు

నిర్యాణము : 2-8-2024

'పల్లెసృజన' వ్యవస్థాపక కార్యదర్శి, ప్రారంభం నుండి పల్లెసృజన కార్యక్రమాల్లో 'అజాత శతృవు' గా అందరు సభ్యులను, ఇన్నోవేటర్లను ఆత్మీయంగా పలకరిస్తూ, తనకు చేతనైన కార్యక్రమాలను, సహాయ సహకారాలను అందించటంలో అందరి మన్ననలు పొందిన

**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గారు**

2-8-2024 న 'పరమ పదించారు'

అని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

వారి ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడ్ని ప్రార్థిస్తూ......

అశృతప్త హృదయాలతో అంజలి ఘటిస్తూ....

**పల్లెసృజన కుటుంబం**

సంపుటి-12 సంచిక - 5 జులై-ఆగస్టు 2024

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 200/-**
**for 1 year Subscription**

## ఈ సంచికలో.....


* 'నిమ్‌జాప్' వాడకంతో పట్టు సిరులు - రైతు క్రిష్ణ అనుభవాలు - 4
* అల్లాడి ప్రభాకర్ మరో నూతన ఇన్నోవేషన్ - ఒరిగిపోయిన సిమెంట్ విద్యుత్ స్తంభాలను సునాయాసంగా నిటారుగా చేసే పరికరం - 6
* 'జి-20' 'సి-20' 'లైఫ్' అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశ సమ్మతులు - 9
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* ఇన్నోవేటర్ 'కొప్పుల అశోక్' మరో నూతన ఆవిష్కరణ - హ్యాండ్ వీడర్‌ను కూర్చుని నడిపే 'పవర్ వీడర్' గా మార్పు - 18
* రసాయన పురుగు మందు అవసరం లేని మరో 'సివిఆర్' ఇన్నోవేషన్ 'మట్టి-ఆముదం-కుంకుడు' ద్రావణం - 20
* పల్లె జ్ఞానం - 23
* పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లతో మిర్చి రైతులకు ఎకరాకు 28 వేల పెట్టుబడి తగ్గింపు - 25
* ఎన్ఐఎఫ్ వారి 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' (ఫైన్-2023) పురస్కారాలు - 28
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32


**కవర్ లోపలి పేజీల్లో ...**

పల్లెసృజన వ్యవస్థాపక కార్యదర్శి కీ.శే. చంద్రకాంత్ శర్మ గారికి నివాళి

రైతుల కొరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

జులై - ఆగస్టు 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# రసాయన రహిత వ్యవసాయ అవలంబనలో జాప్యం ఎందుకు?

గత రెండు దశాబ్దాలుగా దేశమంతా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో రసాయన వ్యవసాయం నుండి రైతుల దృష్టి మరలించడానికి, ప్రజలకొరకు ఆరోగ్యకర ఆహార ధాన్యాలు పండించడానికి ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, రైతులు, సాధారణ పౌరులు, విద్యార్థులు అవిరళ కృషి చేస్తున్నారు. వీరి కృషి తెలుగు రాష్ట్రాల్లో ఫలితాలను సాధించింది. ప్రతి రైతుకు రసాయన రహిత వ్యవసాయం చేయడం సబబు అని, అందరికీ మంచిదన్న భావన కలిగింది. దాన్ని అవలంభించాలన్న తపన కూడా పెరుగుతున్నది. దీనికి ఎన్నో కోణాలున్నాయి. వీటిలో కొన్ని చర్చిద్దాం.

రసాయన వ్యవసాయం అలవాటైన రైతుకు మార్పు తేవాలన్న కోరిక ఉన్నా, అందులోని కష్ట నష్టాల గురించి సరిగ్గా బేరీజు వేయలేక, కుటుంబ పోషణ బాధ్యతలను సరిగా నిర్వహించ గలనా అన్న మీమాంస రైతులను నేరుగా రసాయన రహిత వ్యవసాయాన్ని అవలంభించకుండా చేస్తుంది. యాంత్రికతకు - అంటే ట్రాక్టర్లు, వీడర్లు, స్ప్రేయర్లు, హార్వెస్టర్లకు అలవాటు పడిన రైతాంగం ఈ యంత్రాల ప్రభావం రసాయన రహిత వ్యవసాయ పద్ధతిలో ఎలా ఉంటుందో తెలీక ముందుకు రాలేక పోతున్నారు. యంత్రాల ఉపయోగం సరైనదా కాదా? వాడితే నష్టాలు ఏమిటి? వాడకపోతే కూలీలు లభ్యమవుతారా? ఖర్చు ఎంతవుతుంది? పశువుల అవసరం తప్పదా..... ఇలాంటి సందేహాలకు సరైన జవాబు రైతులకు చేరటం లేదు. రసాయన రహిత వ్యవసాయం అంటే.... సహజ వ్యవసాయమా? సేంద్రియ వ్యవసాయమా? పాలేకర్ పద్ధతా? వెర్మి కల్చం? పర్మా కల్చరా? బయటి విత్తనాలు (సీడ్ కంపెనీలు అమ్మేవి) వాడవచ్చా? భూమి పుష్టికై సహజ ఎరువులు వాడాలా? ట్రాక్టర్‌తో దున్నడం సబబా? పశువుల వాడకం పెంచాలా? ఏ రకం పంటలు పండించాలి? రసాయన రహిత పంటలకు మార్కెట్టు రేట్లు, రసాయన ధాన్యాలకంటే ఎక్కువ ఉండాలా? సర్టిఫికేషన్ అవసరమా? అయితే సులభంగా ఎలా పొందగలము? పురుగు మందులు, జీవామృతాలు వాడటం అత్యవసరమా? యాంత్రికత ఎంతవరకు పరిమితం? ఇలా అనేక సందేహాలు రైతులను ముంచేస్తున్నాయి. జవాబులు సునాయాసంగా, ఆయోమయం లేకుండా రైతులకు లభించడం లేదు. చాలా సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నా, మెజారిటీ రైతాంగానికి ఉన్న సందేహాలకు పూర్తి సమాధానాలు దొరకటం లేదు. ఇలాంటి అయోమయ పరిస్థితుల్లో రైతాంగాన్ని త్వరగా రసాయన రహిత వ్యవసాయాన్ని చేపట్టమని చెప్పడమెలా?



రసాయనాలు వద్దనుకుంటే భూమికి స్వతహాగా పంటను పెంచే శక్తిని పెంపొందించాలి. అంటే అసహజ వ్యవసాయ పనులు, అసహజ విత్తనాలు, ఎరువులు, కనీస యాంత్రిక ఉపయోగం, మనుష్యుల - పశువుల భారీ ఉపయోగం సహజ నిలువ పద్ధతులు, ప్రకృతిని అత్యధికంగా ఉపయోగించడం, మనుషుల - పశువుల వేగాన్ని అన్ని వ్యవసాయ పనుల్లో వాడటం, చాలా ఎక్కువ ఉత్పత్తి ఆశించక పోవడం, పెట్టుబడి ఖర్చును చాలావరకు తగ్గించి, మానవ శ్రమకు పరిమితం చేయడం, ప్రకృతి మనకు ప్రసాదించే రకాలు, సైజులను ఒప్పుకోవడం.... ఇలా మూల సిద్ధాంతాలను ఒప్పుకున్నప్పుడే రసాయన రహిత వ్యవసాయం సాధ్యమని అనిపిస్తుంది. ఇందులో ఆలోచనా పరిధి, సహజత్వాన్ని సంపూర్తిగా గౌరవించి, దానికి చేరువయ్యే దిశగా కార్యకలాపాలు చేయడం అమలు పరిస్తే కాని ఈ మార్పు రాదు. ఇది సులభం కాదు కాని అసాధ్యం కూడా కాదని పల్లెసృజన విశ్వసిస్తున్నది.

వ్యవసాయంలో ప్రకృతి పాత్ర చాలా ఉంటుంది. అది మనం మరిచి, మానవుడు సృష్టించిన విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, స్టోరేజీ పద్ధతులు, ప్రాసెసింగ్ ప్రయత్నాలు,

వ్యవసాయ పద్ధతులు.... ఇవన్నీ అత్యధికంగా గత 5-6 దశాబ్దాలుగా అమలు పరచడంతో ప్రస్తుత తరం గ్రామాల్లోకానీ, పట్టణాల్లో కాని, విద్యాధికుల్లో కాని సహజత్వం తెలీకుండా పోయింది. అన్నీ మానవ ప్రయత్నాలకు, పరిశోధనలకు పరిమితమయ్యాయి. వ్యవసాయంతో ముడిపడ్డ వీరందరిని సహజ వనరుల ఉపయోగమే ప్రధానంగా మళ్ళించడానికి భగీరథ ప్రయత్నం చేయవలసి వస్తుందేమో. వీరందరి దిశ సహజత్వానికి దగ్గరగా చేరాలన్న గమ్యం లక్ష్యంగా పెట్టుకోవాలి. అప్పుడే రైతుల సందేహాలకు జవాబులు లభిస్తాయి. కలిసి కట్టుగా వ్యవసాయ రంగంలోని అందరు పాత్రధారులు ఏక దిశగా పయనించడం ప్రారంభమైతే రసాయన రహిత వ్యవసాయం అవలంభించడానికి రైతులు వెనుకంజ వేయరు.

ఈ దిశగా పల్లెసృజన, రైతులతో అనేక చర్చలు జరిపింది. దాని ఫలితంగా ఒక గమ్యాన్ని నిర్ణయించింది. రైతుల పెట్టుబడులను తగ్గించాలన్న గమ్యంతో మన తెలుగు రాష్ట్రాల్లోని రకరకాల పంటలపై అధ్యయనం చేసి రైతాంగ సమ్మతితో "పల్లెసృజన కిట్" లను నిర్వర్తిస్తున్నది. ప్రప్రథమంగా 'మిరప పంటలకు పల్లెసృజన కిట్' తయారైంది. ఈ ప్రయత్నంలో ఎంతో మంది రైతుల అభిప్రాయాలు, చర్చలు, విమర్శలు, సూచనలు, సలహాలు.... అన్నీ పల్లెసృజన స్వీకరించి పై కిట్‌లో అమలు చేసింది. 30 శాతం ఖర్చు ప్రస్తుతం కంటే పల్లెసృజన కిట్‌లో తగ్గుతుందన్న అవగాహన అయ్యింది. పల్లె వీరరాఘవ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మీ అందరికీ చేర్చాలన్న తపనతో ఈ సంచికలో "మిరప పంటకు పల్లెసృజన కిట్" వివరాలు ప్రచురించాము. దీనిపై మీ అభిప్రాయాలు, సద్విమర్శలకు స్వాగతం. మేము ప్రతిపాదించిన 'పల్లెసృజన కిట్' వాడే విధానం రైతులకు మరింత లాభకరంగా చేయటానికై మీ సలహాలను స్వాగతిస్తున్నాం.

పల్లెసృజన కిట్లు రకరకాల పంటలకు తయారవడానికి మేము చేస్తున్న కృషిలో మీరంతా భాగస్వాములు అవుతారని, రైతులకు అనుగుణ్యంగా, లాభకరంగా ఉండే సమర్థమైన పల్లెసృజన కిట్లు తయారు చేయడానికి ముందుకు రండి. మనమంతా కలసి రైతుల సంక్షేమానికి ప్రయత్నిద్దాం.

ఒడిదుడుకుల వానాకాలాన్ని భరిస్తూ రైతులు తమ వ్యవసాయ కార్యక్రమాలు లాభకరంగా సాగిస్తారన్న ఆశతో...

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

## 'పల్లెసృజ' కార్యక్రమాలపై కేంద్ర మంత్రికి వివరణ

కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ మంత్రి శ్రీభూపేంద్ర యాదవ్ గారు సి-20, జి-20 లో పాల్గొన్న 'లైఫ్ వర్కింగ్ గ్రూప్'ను చర్చలకై ఆహ్వానించారు. 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' అన్న ప్రధాని మోదీ గారి నినాదాన్ని అమలు పరచటానికి 'యోజక్' అనే సంస్థ ద్వారా ఈ కార్యక్రమం 2024 ఆగస్టు 7వ తేదీన, న్యూఢిల్లీలో నిర్వహించ బడింది. ఇందులో పల్లెసృజన కూడా పాల్గొన్నది. " గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు, లైఫ్ స్టైల్‌ని ఎలా మారుస్తాయి" అన్న అంశంపై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చేయవలసిన కార్యక్రమాలను గురించి పల్లెసృజన తమ అభిప్రాయాన్ని మంత్రిగారికి నివేదించింది. అలాగే ఆహారం, అడవులు, వాతావరణం, ఫ్యాషన్ లాంటి విషయాలపైన కూడా మంత్రిగారితో చర్చించడం జరిగింది. మాననీయ మంత్రిగారు అందరు అందించిన సలహాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అందరి సలహాలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై జాతీయ స్థాయిలో చర్యలు గైకొంటామని భరోసా ఇచ్చారు.







# 'నిమ్‌జాప్' వాడకంతో పట్టు సిరులు

## రైతు క్రిష్ణ అనుభవాలు

- జానకి

ఉన్నత చదువు..... అందుకు తగిన ఉద్యోగం.... ఇవేవీ అతనికి సంతృప్తినివ్వలేదు. ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందాలని, అది సేద్యంతోనే సాధ్యమని గ్రహించాడు వరంగల్ జిల్లాకు చెందిన ఓ యువ రైతు. తక్కువ శ్రమ, పెట్టుబడితో మేలైన లాభాలు అందించే పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టాడు. తనకున్న రెండెకరాల్లో మల్బరీ సాగు చేస్తూ... నాణ్యమైన పట్టును ఉత్పత్తి చేస్తున్నాడు.



అతని పేరు కృష్ణ. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం లోని ఆదర్శ గ్రామంగా పేరొందిన గంగదేవిపల్లి గ్రామం. ఉన్నతంగా చదువుకోవాలని ఎమ్మెస్సీ పూర్తి చేసి పట్టా పొందాడు. అందరు వెళ్ళిన దారిలోనే వెళ్ళాలని ఏనాడు అనుకోలేదు. ఉద్యోగం కోసం కాకుండా ... సేద్యం చేయాలని నిర్ణయించుకున్నాడు. సాంప్రదాయ పంట సాగులో నిత్యం నష్టాలు వెంటాడుతునే ఉంటాయి. పంట పండించడానికి ఆరుగాలం శ్రమించినా ఒక్కోసారి ఫలితాలు శూన్యాన్ని చూపిస్తాయి. అందుకే సంవత్సరం పొడవునా స్థిరాదాయాన్నిచ్చే పంటల గురించి ఆలోచిస్తుండగా పట్టు సాగు మేలనిపించింది.

**రెండెకరాల్లో మల్బరీ సాగు :** తనకున్న రెండెకరాల భూమిలో మల్బరీ సాగు చేపట్టాడు. సంవత్సరంలో ఎకరానికి 4 పంటల చొప్పున రెండెకరాలకు 8 పంటలు తీసుకుంటాడు. అది కూడా ఎప్పటికప్పుడు ప్రూనింగ్ చేస్తూ నిరంతరం పంట సాగులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాడు.



**ప్రూనింగ్ :** పాత కొమ్మలను కత్తిరించడం వల్ల నూతనంగా చిగురించే కొమ్మలు మరింత బలంగా ఉంటా యి. దానికి తోడు తక్కువ ఎత్తులో మొక్కను పెంచిఎతే దిగుబడి తీసుకోవడానికి వీలుంటుంది. మల్బరీలో ఆకు దిగుబడి పెరిగేందుకు కూడా ప్రూనింగ్ ఉపకరిస్తుంది. మా గ్రామంలో మొట్ట మొదటిగా పట్టు సాగు చేపట్టింది నేనే. తర్వాత నన్ను చూసి తోటి రైతులు కూడా పట్టు సాగు చేసేందుకు ముందుకొచ్చారు



**అసలు విషయం ఏంటంటే....** మల్బరీ సాగు ఆరంభంలో ఆశాజనకంగా ఉంది. ఆకు దిగుబడి బాగా వస్తుంది అనుకునే సమయంలో ఉన్నట్టుండి మొక్కలు చనిపోతు న్నాయి. అది నిమటోడ్స్ వల్లనా లేక ఫంగస్ వల్లనా తెలియలేదు. సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ వారిని సంప్రదించాడు. నివారణ కోసం చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీ చేసాడు. కానీ ఎలాంటి ఉపయోగం లేదు. అప్పటికే చాలా మొక్కలు ఎండిపోయి చని పోయాయి. ఇక లాభం లేదని పరిష్కారం కోసం యూట్యూబ్‌లో వెతికాడు. అప్పుడే నిమటోడ్స్ నివారణి నెమ్‌జాప్ గురించి తెలిసింది. పల్లెసృజన ద్వారా వెలుగు లోకి వచ్చిన 'నెమ్‌జాప్' అనే మూలికా పురుగు మందును తయారు చేసిన 'గల్లా చంద్రశేఖర్' అనే ఇన్నోవేటర్ గురించి తెలుసుకున్నాడు. గల్లా చంద్రశేఖర్ దాని పనితీరు గురించి వివరించడం చూసాడు.



ఇన్ని ప్రయ త్నాల్లో, చివరి ప్రయత్నం గా మాత్రమే 4 లీ. నెమ్‌జాప్ తెప్పించుకుని వా డాడు. మొదట్లో తాను మోతాదు పరిమాణం గురించి అవగాహన లేక సరైన సలహాలు తీసుకోకుండా తొందరపడి ఉపయోగించాడు. దీంతో ఫలితాలు అంతంత మాత్రమే వచ్చాయి. వెంటనే మరలా వారిని సంప్రదించి .... ఈసారి



వారి సూచనలు పాటిస్తూ కషాయాన్ని వినియోగించాడు. వాడి కొన్ని రోజులకు మొక్కలకు కొత్త చిగుర్లు రావటం గమనించాడు. తన ఆలస్యం వల్ల అప్పటికే ఎన్నో మొక్కలు చనిపోయినందుకు బాధనిపించినా... ఉన్న కాస్త పంట కోలుకోవటంతో ఊపిరి పీల్చుకున్నాడు.

**షెడ్డు నిర్మాణం, ఖర్చులు:** పట్టు సాగులో షెడ్డు నిర్మాణం కీలకం. దీనికి కొంచెం ఎక్కువ గానే ఖర్చు అవుతుంది. అలాగే తాను మల్బరీ పంటకు ఎక్కువగా రసాయ నాలు వాడడు కేవలం జీవామృతం, సహజ





కషాయాలు మాత్రమే వాడు తుంటాడు. కాబట్టి ఖర్చులు అదు లో ఉన్నాయి. సరైన పద్ధతులు పాటిస్తే పెట్టిన పెట్టుబడి సంవ త్సరంలో తిరిగి తీసుకోవచ్చు. భయపడాల్సిన అవసరం లేదు. ఇది మన చేతిలో ఉండే పంట కాబట్టి మనం తీసుకునే జాగ్రత్తల పైనే ఆధారపడి రాబడి ఉంటుంది అంటాడు కృష్ణ.

**ఎమ్.ఎస్‌సి చదివి ఈ పంటను ఎంచుకోవడానికి కారణం ? :** తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదా యాన్ని రాబట్ట వచ్చు. 20–25 రోజుల్లో పంట చేతికొస్తుంది. పంట తీసిన తర్వాత, తర్వాత పంట వచ్చే వరకు ఖాళీ సమయాన్ని కుటుంబంతో సరదాగా గడుపుతాడు



**నాణ్యత ఉంటేనే ధర:** మార్కెట్ ధర అనేది పట్టు గూళ్ళ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. రైతు సాగు చేసిన మల్బరీ పంట ఎంత బలంగా ఉంటే అంత ఎక్కు పంట తీసుకోవచ్చు.



పట్టు పురుగులు చాలా సున్నితంగా ఉంటాయి. విషాన్ని తట్టుకోలేవు. ఈ ఆలోచనతోనే సేంద్రియం గా మల్బరీ సాగు చేస్తున్నా డు. ఈ సేంద్రియ కషాయా లు డ్రిప్‌లో ఇవ్వటం లేదా నేరుగా ఆకులపై పిచికారి చేసినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. అదే రసాయన ఎరువులు వేయటం వల్ల నాణ్యత మాట అటుంచితే... కనీసం పురుగులు కూడా జీవించి ఉండవు.

అటువంటి పరిస్థితి రావద్దనే ప్రకృతి వ్యవసాయం చేస్తూ నాణ్యత కొనసాగిస్తున్నాడు. ఇతరుల పట్టుగూళ్ళకి, తన పట్టుగూళ్ళకి చాలా తేడా ఉంటుంది. మార్కెట్‌లో సెల్ రేషియోని పరిగణలోకి తీసుకుని నాణ్యత పరీక్ష చేస్తారు. తన పట్టుగూళ్ళ నాణ్యతా రేషియో 21, 22, 23 శాతంగానే ఉంటుంది. ఇతరులు 21 కంటే దిగువ స్థాయిలో ఉంటారు. కాబట్టి ఇప్పటి వరకు తనకు సాగు లాభదాయకంగానే ఉంది. ఇందులో ఉండే సెల్ రేషియో మందంగా ఉండటం వల్ల పట్టుగూళ్ళ పరిమాణం చూడ్డానికి చిన్నదిగా అనిపించినా... బరువు అధికంగా ఉంటుంది. ప్రతి ఏటా రైతులు గిట్టుబాటు ధరకే పట్టుగూళ్ళను కొనుగోలు చేస్తారు.

**మార్కెట్ సౌలభ్యం :** కృష్ణ వాళ్ళకి దగ్గర్లోనే మార్కెట్ ఉంది. ఇది కాకపోతే సికింద్రాబాద్ సమీపంలోని తిరుమలగిరి. ఈ రెండు మార్కెట్‌ల ధరలలో పెద్ద తేడా ఉండదు. ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. కేజీ పట్టుగూళ్ల ధర రూ. 550 – 700 వరకు పలుకుతోంది.





2018లో తాను అమ్మిన గరిష్ఠ ధర రూ. 320. ప్రస్తుతం గరిష్ఠ ధర రూ. 843. ప్రతి సంవత్సరం నవంబరు నుంచి మార్చి మధ్యలో ధరలు పెరు గుతాయి. వాతావరణ పరిస్థి తులు కూడా సహకరిస్తాయి. పట్టు గూళ్లకు నాణ్యత ఉంటుంది కానీ ఎల్లప్పుడూ స్థిరంగా ఉండే ధర మాత్రం రూ. 500–550.

ఒత్తిడి జీవితం వద్దనుకుని పట్నంలో ఉండే వాళ్లకు పోటీగా నెలకి 60–70 వేలు సంపాదిస్తున్నాడు. పట్టు సాగుపై ఆసక్తి ఉన్నవారు అనుభవం గల రైతుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. లేదంటే ఆదిలోనే నష్టాలు వచ్చే అవకాశం ఉంది.

**పట్టుసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

పంట అంపోయిన తర్వాత రేరింగ్ గది నుంచి చనిపోయిన గూళ్లు, వ్యర్థ పదార్థాలను తీసేసి గది శుభ్రం చేసుకోవాలి. మాగిన పట్టు పురుగులు గూళ్లు కట్టడం కోసం చంద్రికల మీద వేసినప్పుడు కొన్ని పురుగులు గూళ్లు కట్టకుండా చనిపోతాయి. అలాంటివి ఉన్నప్పుడు తర్వాత పంటకు రోగాలు సోకే అవకాశం ఉంది. అందువలన వాటిని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేసుకోవటం మంచిది.

పట్టుగూళ్లు తీసి వేసిన తర్వాత వెంటనే చంద్రికలను 5 శాతం బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలి. తర్వాత వాటిని ఎండలో ఆర బెట్టి తిరిగి వాటి ప్రదేశానికి తీసుకు రావాలి. వాటిమీద ఉండే పోగు పోయేందుకు వాటి ని జాగ్రత్తగా బర్నర్ లేదా ఫ్లేమ్ గన్ సహాయంతో



కాల్చాలి. ప్రతిసారి మేత వేయడానికి ముందు గది పొడిగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా గాలి, వెలుతురు ప్రసరించాలి. ●

**'నెమ్‌జాప్' వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 94912 78836, 833 1800 100**

**శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ – 94912 78836, శ్రీ వినోద్ కుమార్. ఎస్ – 86606 19009, శ్రీ మురళి – 98668 51525**

# అల్లాడి ప్రభాకర్ మరో నూతన ఇన్నోవేషన్
# ఒరిగిపోయిన సిమెంట్ విద్యుత్ స్తంభాలను సునాయాసంగా నిటారుగా చేసే పరికరం



- వీరరాఘవ రెడ్డి

విద్యుత్తు ప్రస్తుత జీవన విధానంలో నిత్యావసంగా మారి పోయిన ఈ కాలంలో మనమందరం ఏమాత్రం విద్యుత్ కోతను కూడా భరించలేక పోతున్న విషయం అందరం అనుభవిస్తున్నాము. మన ఇంటికి కరెంటు రావాలంటే ఎక్కడెక్కడి నుంచో కరెంటు స్తంభాల ద్వారా వైర్లలో కరెంటు వస్తుంది. ఆ కరెంటు స్తంభాలు చాలా వరకు వ్యవసాయ పొలాల్లోను, రోడ్లవెంట ఉండటం కూడా మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. ఆ కరెంటు స్తంభం పాతిన భూమి కృంగిపోయే గుణం కల తేలిక భూమి అయితే స్తంభాలు ఒక వైపుకు ఒరిగి పోవటం కూడా మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. వాటిని సరిచేసి మళ్ళీ నిటారుగా చెయ్యాలి అన్నపుడు విద్యుత్ శాఖ వారు ప్రతి ఎండా కాలం చేసే నిత్య కృత్యాలలో ఒకటి. అలా ఒకవైపు ఒరిగిపోయిన స్తంభాలను మళ్ళీ నిటారుగా చెయ్యటానికి ఆ శాఖవారు బయలుదేరటమే ఒక యుద్ధానికి బయలు దేరినట్లు ఉంటుంది. పూర్వపు పరిస్థితులు వేరు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక ట్రాక్టరు, అందులో ఒరిగిపోయిన స్తంభానికి కట్టడానికి తాళ్ళు, వాటిని లాగటానికి బలమైన 5–6 మంది వ్యక్తులు, ఆ స్తంభం చుట్టూ కూరుకు పోయిన మట్టిని తియ్యటానికి పారలు, గుణపాలు, సరైన సూచన అందించే నిపుణులు..... ఇలా ఒక పెద్ద తతంగమే ఉంటుంది. పైగా ఈ పని చాలా ఖర్చుతో కూడుకున్నది.

వేగంగా మార్పు చెందుతున్న ఈ కాలంలో బలమైన వ్యక్తులు లభించటం కూడా కష్టం కావటంతో ప్రస్తుతం ట్రాక్టరుతోనే ఒరిగిన స్తంభాన్ని నెట్టడం, లేదా క్రేన్ లాంటి పెద్ద వాహనాన్ని ఉపయోగించి ఒరిగిన స్తంభాలను సరిచేయటం చేస్తూ ఉన్నారు. ఈ పనులన్నీ కూడా చాలా శ్రమ, ఖర్చు, సమయంతో కూడుకున్నవి. ఈ పనులన్నీ ఎండా కాలం మాత్రమే చేసినా, ఒక్కోసారి అత్యవసర సమస్య వచ్చినపుడు వర్షాకాలంలో కూడా చెయ్యాల్సి ఉంటుంది. పొలాల్లో పంటలు



నిటారుగా మారిన ఒరిగిన స్తంభం



మోటారు సైకిల్ పైన తీసుకు వెళ్తున్న పరికరం



స్తంభం వద్దరు ఇద్దరు వ్యక్తులు సులువుగా తీసుకు వెళ్ళటం

ఉన్నపుడు ఈ పని చెయ్యాలంటే ఆ స్తంభం చుట్టూ కొంతమేర పంట నష్టం జరుగుతుంది కాబట్టి ఆ పొలం యజమాని అందుకు ఒప్పుకోడు, లేదా ఆ రైతుకు నష్టపరిహారం కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ సమస్యలన్నిటినీ మెట్‌పల్లికి చెందిన విద్యుత్ శాఖ 'అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్' (ఎడిఇ) మనోహర్ గారు తన మిత్రుడు, మన పల్లెసృజన ఇన్నోవేటర్ అయిన 'మెట్‌పల్లి'కే చెందిన అల్లాడి ప్రభాకర్‌తో వివరించి, ఎన్నో ఇన్నోవేషన్‌లు చేసి చాలా సమస్యలకు పరిష్కారం చూపావు కదా, ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం తయారు చెయ్యమని కోరాడు. అందుకు అల్లాడి ప్రభాకర్ మనోహర్ గారు చెప్పిన సమస్యను అవగాహన చేసుకుని పైన వివరించిన శ్రమ, ఖర్చు, సమయం అన్నీ తగ్గించేలా, ఒక మోటార్ సైకిల్‌పైన తీసుకు వెళ్ళగలిగి, కేవలం 15-20 నిమిషాలలోనే ముగ్గురు వ్యక్తులతో, చాలా తక్కువ శ్రమతో ఒరిగిపోయిన స్తంభాన్ని నిటారుగా చేసేలా ఒక పరికరం తయారు చేశాడు. ఇటువంటి పరికరం ఇంతవరకు ఎవ్వరూ తయారు చెయ్యలేదు. ఈ పని చేయటానికి ఇంధన శక్తి లేదా విద్యుత్తు అవసరం లేదు.

ఈ పరికరంలో నిర్ధారించిన పొడవున్న ఒక చతురస్రాకారపు ఇనుప పైపుకు క్రింది భాగంలో ఒక ప్లేట్ ఏర్పాటు చేశాడు, దానికి రెండు చక్రాలను ఏర్పాటు చేయబడి ఉండటం వల్ల మోటార్ సైకిల్ వెనక భాగంలో కట్టుకుని అవసరమున్న చోటికి సులభంగా తీసుకు వెళ్ళవచ్చు. ఒరిగిపోయిన స్తంభం వద్దకు వెళ్ళిన తర్వాత చతురస్రాకార స్తంభాన్ని స్తంభం ఒరిగి వున్న వైపు చతురస్రాకారపు పైపును స్తంభానికి ఆనిస్తారు. పరికరానికి మరో వైపున (చక్రాలు వున్న చట్రం వైపు) పరికరం కదలకుండా ఉండేందుకు వీలుగా, భూమిలోకి చొచ్చుకు పోయి కదలకుండా భూమిలోకి చొచ్చుకు పోయేలా చేస్తారు. ఈ విధంగా మూడు కొయ్యలు ఏర్పాటు చేయటం వల్ల అది భూమికి



ఒరిగిన స్తంభం వద్ద ఏర్పాటు చేస్తున్న పరికరం

అతుక్కుపోతుంది. ఆ తర్వాత ఈ పరికరానికి పెద్ద పెద్ద యంత్రాలను సులభంగా పైకి క్రిందకు దించే ఒక సన్నటి ఇనుప గొలుసు కలిగిన కప్పిని ఏర్పాటు చేస్తారు. ఆ కప్పికి ఉన్న గొలుసులు సులువుగా క్రిందకు ఒక మనిషి చేతితో సునాయాసంగా లాగుతూ ఉంటే చతురస్రాకారపు పైపు కరెంటు స్తంభాన్ని చిన్నగా నెట్టుతూ ఉంటుంది. స్తంభం నిటారుగా కావాల్సిన వైపుకు కొంత మట్టిని త్రవ్వి తీయటానికి అనువుగా ఒక చిన్న పార (కొన్ని ప్రాంతాల్లో దీన్ని చలిక అంటారు)ను కూడా తయారు చేశాడు. ఆ పారతో స్తంభం లేవాల్సిన వైపు కొంత మేర మట్టిని బయటకు తోడేస్తారు. స్తంభం నిటారుగా అయిన తర్వాత ఇంతకు ముందు స్తంభం ఒరిగి వున్న వైపు రంధ్రం ఏర్పడి గొయ్యిలాగా ఉంటుంది. ఆ గొయ్యిలోకి రాళ్ళు వేసి ఒక గుణపంతో ఆ రాళ్ళపైన కొట్టి, స్తంభాన్ని భద్రంగా ఉండేలా చేస్తారు.

ఈ పనంతా కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు చేస్తారు. వారు కూడా మరీ బలవంతులు, శారీరక దారుఢ్యం కలవారు కావాల్సిన అవసరం లేదు. సాధారణ కష్టం చేయగలిగిన వ్యక్తులు చాలు కేవలం 15-20 నిమిషాలలో ఒక్కో స్తంభాన్ని నిటారుగా నిలుపుతారు. ఇదే పని గతంతో చెయ్యాలంటే, 10-15 మంది బలమైన వ్యక్తులు, ఒక ట్రాక్టరు, ఇంకా ఇతర సామాగ్రి వెరసి ఒక్కో స్తంభం నిటారుగా నిలబెట్టడానికి కనీసం 8 నుండి 10 వేల దాకా ఖర్చయ్యేది, ఇలాంటి స్తంభాలను అంతమంది వ్యక్తులు రోజులో రెండు లేదా మూడు స్తంభాలను మాత్రమే


అవసరమైన పరికరాలను తయారు చేసిన ప్రభాకర్




ఒరిగిన స్తంభం




నిటారుగా చెయ్యటానికి మట్టిని త్రవ్వటం




స్తంభం నిటారుగా అయిన తర్వాత ఒరిగిన వైపు రాళ్ళతో భద్రపరచటం

నిటారుగా చేసేవారు. అలాంటిది కేవలం రూ. 40 వేల ఖరీదు చేసే ఈ పరికరంతో ముగ్గురు వ్యక్తులు రోజుకు 8 నుండి 10 స్తంభాలకు పైగా నిలబెడతారు. ఈ పరికరం వల్ల ఎక్కువ మంది అవసరంలేకుండా, ట్రాక్టరు, క్రేన్‌ల లాంటివి అవసరం లేకుండా కేవలం ఒక మోటారు సైకిల్ పైన వెళ్ళి, ఒరిగి పోయిన స్తంభాలను నిటారుగా చేసి రావచ్చు.

ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే, ఊర్లలో సందు గొందుల్లో స్తంభాలు ఒరిగి పోతే వాటిని సరిచేయాలంటే ఇంకా కష్టం, ఖర్చుతో కూడుకున్న పని. ఈ పరికరం చాలా చిన్నగా ఉంటుంది, ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళవచ్చు కాబట్టి ఎంతటి చిన్న సందుల్లో అయినా సునాయాసంగా పని పూర్తి చేసుకుని రావచ్చు. ఇక పంట పొలాల్లో స్తంభాలు ఒరిగి పోయినా రైతుకు ఎటువంటి పంట నష్టం జరగకుండా పని పూర్తిచేయవచ్చు.




తను ఇచ్చిన సమస్యకు ఇంత చక్కటి, సులువైన పరికరాన్ని అందించినందుకు ఎడిఇ మనోహర్ గారు తన మిత్రుడు అల్లాడి ప్రభాకర్‌ను అభినందించడంతో పాటు, తన పై అధికారులకు ఈ విషయాన్ని వెల్లడించి, ఇలాంటి పరికరాలు ప్రతి సబ్ స్టేషన్ వద్ద ఒకటి ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను గురించి తెలియజేశారు.

ఈ సమస్య ఒక్క మెట్‌పల్లి లోనే కాదు, యావత్ భారతదేశం లోని ప్రతి సబ్ స్టేషన్‌లో ఒకటి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీన్ని ఏర్పాటు చేసుకోవటం వల్ల విద్యుత్ శాఖకు కోట్లాది రూపాయలు ఆదా అవటమే కాకుండా, సమస్య ఏర్పడిన వెంటనే సత్వర చర్యలు తీసుకుని పరిష్కరించే అవకాశం కూడా ఉంటుంది.

ఒక మిత్రుడు ఇచ్చిన సమస్యను సవాలుగా స్వీకరించి, అద్భుతమైన పరిష్కారం చూపిన అల్లాడి ప్రభాకర్ తయారు చేసిన మరో అత్యద్భుత ఇన్నోవేషన్ అని సగర్వంగా చేబుతోంది 'పల్లెసృజన'. ఈ సమస్యను జాతీయ స్థాయిలో వివరించి, ఈ పరికరాన్ని అందజేసేందుకు అవసరమైన చర్యలకు ఉద్యుక్తమవుతోంది పల్లెసృజన. మన ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యుత్ శాఖాధికారులు కూడా సత్వరం పూనుకుని ఈ పరికరాలను ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఒకటి ఏర్పాటు చేసినట్లయితే విద్యుత్ స్తంభాలను త్వరితంగా సవరించి, విద్యుత్‌ను నిరాటంకంగా అందించ వచ్చు. ప్రతి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్లు సత్వర చర్యలు గైకొని, పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మ కతను ఉపయోగించుకోవాలని కోరుకుంటోంది పల్లెసృజన. ఈ పరికరం పనిచేసే వీడియో మరిన్ని వివరాలకై సంప్రదించండి. ●

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్, ఫోన్ : 9440037475**

**వీర రాఘవ రెడ్డి, పల్లెసృజన, ఫోన్ : 81257 99904**

# 'జి-20' 'సి-20' 'లైఫ్' అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశ సమ్మతులు




7. **ప్రకృతి జీవన విధానం 'లైఫ్'** లోకి మారటం అన్నది సాంఘిక, భావోద్వేగ, నైతిక, ఆధ్యాత్మిక ప్రక్రియ అని గమనించాలి. ప్రకృతితో మమేకం అవటం, తిరిగి సంబంధాలు కల్పించుకోవటం అన్నది పునాది దశలోనే (అనగా 3 నుంచి 8 సంవత్సరాల వయసులోనే) ప్రత్యక్ష మరియు పరోక్ష ప్రయోగాలు, నిజ జీవితపు అనుభవాలు, స్వయంగా పాల్గొని నేర్చుకునే పద్ధతులు మొదలైన అనేక మార్గాలు, అన్ని స్థాయిల్లో జరగాల్సి ఉంటుంది.

8. **ప్రకృతి ఆధారిత పరిష్కారాల ప్రచారం - అనుసరణ :** ప్రకృతి ఆధారిత పరిష్కారాలు అన్నవి అందరికీ తెలిసిన పద్ధతులే. (ఉదా.: పవిత్ర అడవులు, సాంప్రదాయ వ్యవసాయం, అడవి ఉత్పత్తులు మొదలైనవి). ఈ పద్ధతి సాంప్రదాయ జ్ఞానము, స్థానిక పద్ధతులు, సమూహాల అనుభవాలపై నిర్మింపబడాలి.

❀ సరియైన అమలుతో బహుళ ప్రభావం ఉంటుంది. ఉదా.: సమైక్య వాటర్‌షెడ్ యాజమాన్యాల ఫలితంగా నీరు, భూమి సంరక్షణ, వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి, వృక్షాల పెంపుదల, ఆర్థికపరంగా జీవన విధానాల అభివృద్ధి జరుగుతాయి.

9. **అన్ని ఆర్థిక రంగాలలో** ఆర్థిక వృత్త సూత్రాలను తప్పనిసరిగా అమలయ్యేట్లు చూడాలి.

❀ 'జి-20' సభ్య దేశాలు వారివారి ఆర్థిక రంగంలో ఆర్థిక వృత్త సూత్రాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలి. దీనికి తగ్గట్టు వారికి అవసరమైన విధాన నిర్ణయాలు, చేసిన నిర్ణయాలలో తగు మార్పులు ఉండేలా చూసుకోవాలి.

❀ సరళ ఆర్థిక పద్ధతి 50% హరిత గృహ వాయువులకు కారణమౌతోంది. ముడిసరుకు వస్తువులుగా మార్చబడి, వినియోగించబడి లేదా వాడి నేరుగా వాతావరణంలోనికి విసర్జించడమే దీనికి కారణం.

❀ వృత్త ఆర్థిక పద్ధతితో పై సవాళ్ళను ఎదుర్కోవడానికి సహాయ పడుతుంది. వృధాల తగ్గింపు ఆర్థిక వృత్తంలోకి తీసుకు వెళ్ళే పద్ధతులను అనుసరించడం వల్ల సహజ సంపద సంరక్షింప బడుతుంది.

❀ వ్యాపార సంస్థలు, పరిశ్రమలు తమ ఉత్పత్తులను, వస్తువులను సమర్థవంతమైన వనరుల యాజమాన్యం తో సక్రమమైన వ్యర్థాల నిర్వహణతో పని చేసినపుడు వారికి 'గ్రీన్ క్రెడిట్స్' (పర్యావరణ రక్షణలో పాలు పంచుకున్నం దుకు గాను) ఇచ్చి వాటిని పన్నులలో, గ్రాంటులలో, ఇతర రకములైన ఆర్థిక ప్రోత్సాహకాలతో బదిలీ చేసుకునే సదుపాయం కల్పించాలి.

10. **'లైఫ్' అన్ని రంగాలలో** వీటిని సమంగా అందరికీ అందేలా చూడటం, అతి జాగ్రత్తగా ఉపయోగించటం.

❀ పంచ తత్వాలలో 'నీరు' అన్నది అతి ముఖ్యమైన తత్వం.

❀ నీటిని పునర్ ఉపయోగం చేసినా, తిరిగి వాడటానికి అనువుగా మార్చినా, కొత్త నీటిని సృష్టించినట్లే.

❀ ఆహారంలో కాని, పంటలలో కాని నీటిని తక్కువగా వాడే పద్ధతులను అవలంభించాలి.

❀ నీటి అవసరమున్న ప్రతి రంగంలోను "అవసరము - సరఫరా" యాజమాన్యం ప్రభావ వంతంగా చేయాలి.

### ఉదాహరణలు : పునాది స్థాయి ఇన్నోవేటర్లను గుర్తించటం

భారతదేశంలోని హైదరాబాద్ నగరంలో "పల్లెసృజన" అనే స్వచ్ఛంద సంస్థ 'పునాది స్థాయి ఇన్నోవేటర్ల' జీవన స్థితిని మెరుగు పర్చటానికి అంకిత భావంతో పని చేస్తోంది. గ్రామాలలో, మారుమూల ప్రాంతాలలో ఉన్న ఇన్నోవేషన్లను గుర్తించి, వారి ఇన్నోవేషన్లను గ్రంథస్తం చేయటానికి 'పల్లెసృజన' శోధయాత్రలు నిర్వహిస్తుంది. ఇన్నోవేటర్‌ను గుర్తించిన తర్వాత అతని ఇన్నోవేషన్‌కు అవసరమైన సాంకేతికపరమైన మార్పిడి చేయటానికి సలహాలు, సూచనలు, సహాయము అందజేసి, తుది రూపాన్ని ధృవీకరించి, పేటెంటు చేయడానికి కూడా సహాయపడుతుంది. ఇప్పటి వరకు పల్లెసృజన 78 మంది ఇన్నోవేటర్లను, వెయ్యికి పైగా సాంప్రదాయ ఔషధ పద్ధతులను గుర్తించి, వాటిని "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" లో నమోదు చేయించింది. 'పల్లెసృజన' గుర్తించిన ముగ్గురు ఇన్నోవేటర్లు భారత దేశంలో మూడవ అత్యున్నత ప్రజా పురస్కారం అయిన 'పద్మశ్రీ' వరించింది. 'పల్లెసృజన' కేవలం స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా నిర్వహించ బడుతోంది. అంకిత భావంతో పునాది స్థాయి ఇన్నోవేషన్లపై మక్కువ ఉండి, ఇన్నోవేటర్ అంటే అభిమానం ఉన్న ఈ స్వచ్ఛంద కార్యకర్తలే 'పలెసృజన'కి వెన్నెముకగా సేవలందిస్తున్నారు. ●

(సశేషం - వచ్చే సంచికలో.....)



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అభివృద్ధి చేయబడ్డ 'కంది' రకం "కుద్రత్ - 3"

**ఆవిర్భావం :**



ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రైతు 'ప్రకాష్ సింగ్ రఘువంశీ' ఎక్కువ ప్రాచు ర్యంలో ఉన్న 'ఆశా' కంది రకం నుండి ఎంపిక చేసిన పద్ధతిలో అనేక ప్రయోగాలు చేసి, ఈ కుద్రత్–3 అనే కంది రకం విత్తనాన్ని రూపొందించాడు. ఎక్కువ కాయలు కాసే ఈ రకం కంది ఆ ప్రాంత రైతుల మన్ననలు కూడా అందుకుంది. ప్రస్తుత కాల పరిస్థితుల్లో ఎక్కువ దిగుబడి సాధించే విత్తనాల అవసరం రైతులకు ఎంతో ఉంది.

**ప్రత్యేక లక్షణం :**

❀ పెద్ద గింజలు.
❀ ఆరోగ్యంగా బలంగా ఉండే మొక్క.
❀ వంద గింజల బరువు సుమారు 18 గ్రా.
❀ హెక్టారుకు 3000–3500 కిలోల దిగుబడి.

**అనువైన వాతావరణం :**

❀ ఉష్ణ మండలాల్లో, ఉప ఉష్ణ మండలాల్లో వేయటానికి అనువైనది.
❀ మొక్క ఎదిగేవరకు తడితో కూడిన వేడి వాతావరణం ఉష్ణ వాతావరణం ఉండాలి.



❀ కాయలు వచ్చే సమయానికి ఎండ బాగా ఉండాలి.

**ఇతర లక్షణాలు :**

❀ విత్తనాలను 2 సంవత్సరాల వరకు నిలువ చేసుకోవచ్చు.
❀ కాలానుగుణంగా పండే పంట.

## నిమ్మకాయలు కోసే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

ఊరగాయల పరిశ్రమ చాలా శ్రమతో కూడుకున్నది. ఈ పరిశ్రమ దేశం మొత్తం వ్యాపించి వున్నా, దక్షిణ భారత దేశంలో ఎక్కువగా ఉందని చెప్పొచ్చు. పెద్దయెత్తున ఊరగాయలు తయారు చేసే పరిశ్రమలు కొన్ని వున్నా, చాలా వరకు మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమగానే విరాజిల్లు తున్నాయి. ఈ పరిశ్రమలో చెప్పుకోతగ్గ అంశమేమిటంటే ఇది కాలంమీద ఆధార పడిన పరిశ్రమ. నిమ్మకాయ ఒక్కటే సంవత్సరానికి రెండుసార్లు పండే పంట. ఏప్రిల్ జూన్‌లలో అదేవిధంగా సెప్టెంబర్ డిసెంబర్ మధ్య కాలంలో నిమ్మకాయలు విరివిగా పండుతాయి. ఈ సమయంలో నిమ్మకాయలు కోయటానికి కూలీలు లభించినా, ఎక్కువ వేతనాలు అడుగుతారు. ఈ సమస్యకి పరిష్కారంగా తమిళనాడుకు చెందిన ఎన్. నాగరాజన్ నిమ్మకాయలను కావలసిన సైజులో తరగటానికి ఉపయోగపడే ఒక యంత్రాన్ని కనుగొన్నాడు.





**పరికరం :**

ఈ యంత్రం సహాయంతో నిమ్మకాయలను కావలసిన సైజులో సులభంగా తరగవచ్చు. ఈ యంత్రం ప్రత్యేకించి ఆహార పదార్థాల తయారీదారులకి, ఊరగాయలు, మసాలాలు తయారు చేసేవారికి ఉపయోగకరం.

**సాంకేతిక వివరాలు :**

- దీని పొడవు 40 అంగుళాలు, ఎత్తు 30 అంగుళాలు, వెడల్పు 40 అంగుళాలు.
- యంత్రం మొత్తం బరువు 350 కిలోలు.
- రెండు హార్స్‌పవర్‌ల ఎ.సి. మోటారు బిగించబడి వుంటుంది.
- 220 వోల్టుల కరెంటు అవసరమౌతుంది. 3 ఫేస్‌లు మరియు సింగిల్ ఫేస్ మోటార్లతో లభ్యం.
- యంత్రం ఆహార పదార్థాలకి వాడదగ్గ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేయబడింది.

**ముఖ్యాంశాలు :**

- 0.75 అంగుళాల నుండి 2.5 అంగుళాల చుట్టు కొలత గల కాయలను స్ప్రింగ్ లోడ్ మెకానిజమ్ ద్వారా తరుగుతుంది.
- నిమిషానికి 150 నిమ్మకాయలను తరగవచ్చు.
- ఒక క్రమపద్ధతిలో ఒకేసైజుగల ముక్కలుగా తరుగుతుంది.
- తరిగిన ముక్కలను తేలికగా సేకరించవచ్చు.
- ఒక నిమ్మకాయను 4/ 8/ 16 ముక్కలుగా తరగవచ్చు.
- చాలా తక్కువ కరెంటు ఖర్చవుతుంది. గంటకో యూనిట్ కరెంటును మాత్రమే వినియోగిస్తుంది.
- ఒకే మనిషి ఈ యంత్రాన్ని నడపచవచ్చు.
- ఎటువంటి వృధా ఉండదు.

**పురస్కారాలు :**

- 2005లో ఎన్ఐఎఫ్ వారి 3వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయి బహుమతి లభించింది.

## బియ్యం నుండి తవుడు, నూకలు వేరు చేసే యంత్రం

**సమస్య - పరిష్కారం:**

బియ్యం నుండి నూకను, మెరికను వేరు చేయడం అన్నది కొన్ని శతాబ్దాలుగా చేతులతో చేస్తూ వచ్చారు. ఈ ప్రక్రియ జరిగినప్పుడే రాళ్ళు, ఊక, తవుడును కూడా వేరు చెయ్యాల్సి వుంటుంది. తవుడు పొట్టు గాలికి ఎత్తి తియ్యగా గింజలు చేతితో తియ్యాల్సి వుంటుంది. ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. చాలా సమయం కూడా పడుతుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోహన్ శర్మ ఈ పనులన్నీ సులువుగా చెయ్యటానికి ఒక యంత్రం రూపొందించాడు. గాలి కొట్టుడు సూత్రంపై పనిచేసే ఈ యంత్రం సహాయంతో తవుడు, పొట్టు, మంచి బియ్యం, నూకలు, గరిక (పొట్టు ఊడని గింజలు) అన్ని వేరు చెయ్యవచ్చు.

**పరికరం:**

ఈ యంత్రాన్ని మోహన్ శర్మ చెక్కతో తయారు చేశాడు. పిండిమరకు ఉన్నట్లు పై భాగంలోనుంచి బియ్యం పొయ్యాల్సి వుంటుంది. దీని క్రింద ఉండే ఫ్యాను కారణంగా బియ్యంలోని మంచి బియ్యం, నూకలు, గరిక గింజలు విడిపోయి వేరువేరు సైజులలో వున్న కన్నాల ద్వారా విడివిడిగా బైటకు వస్తాయి. ఇది బరువు ఆధారంగా వేరుచేసే పద్ధతిపై పని చేస్తుంది. రాళ్ళు ఎక్కువ బరువు కనుక అవి ముందు వస్తాయి. తరువాత బియ్యం గింజలు ఒక జల్లెడపై పడి నూక, మంచి బియ్యంగా విడిపోతాయి. ఊక, తవుడు దూరంగా వెదజల్లబడతాయి. దానికి కొంత ముందు గరిక గింజలు పడతాయి.

**సాంకేతిక వివరాలు:**

- ఈ యంత్రం 42 అంగుళాల పొడవు, 16 అంగుళాల వెడల్పు, 47 అంగుళాల ఎత్తు వుంటుంది.
- 22 అంగుళాల ఫ్యాను ఉంటుంది.
- ఈ యంత్రం ద్వారా గంటకు 40 కిలోల బియ్యం సేకరించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- ఈ యంత్రం చాలా సులభంగా, త్వరగా మంచి బియ్యం, నూకలు, గరిక గింజలు, తవుడు, ఊకను వేరు చేస్తుంది.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2013లో తమ 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో మోహన్ హర్మని ప్రోత్సాహక బహుమతితో సత్కరించింది.

**వివరాలకు సంప్రదించండి:**
**క్రియేటివ్ మైండ్స్ ఫోన్: 9652801700**





# అభివృద్ధి చేయబడ్డ సాంప్రదాయ దేశీ సజ్జ విత్తనాలు 'సుల్కానియా సజ్జ'

62 సంవత్సరాల 'హనుమాన్‌రాం ఝూరియా' రాజస్థాన్, చూరు జిల్లాలో గల 'సుల్కానియా' గ్రామంలో గత 40–45 సం.ల నుంచి ఉత్తమమైన గింజల ఎంపిక పద్ధతిలో సజ్జలు పండిస్తున్నాడు. తాను పండించే సజ్జలకి తన గ్రామం పేరే 'సుల్కానియా సజ్జలు' అని పెట్టుకున్నాడు. పొడవైన కంకులు కలిగి వుండి, తియ్యటి గింజలు కలిగి, ఎక్కువ దిగుబడినివ్వటం, కరువు పరిస్థితులను తట్టుకోవటం, ఎక్కువ పశుగ్రాసం ఇవ్వటం ఈ సుల్కానియా సజ్జల ప్రత్యేకత.

హనుమాన్‌రాం తాత ముత్తాతలు కూడా ఈ రకమైన సజ్జలనే పండించేవారట. బికనీర్ నుంచి వచ్చిన ఒక ఆధ్యాత్మిక గురువు 300 సంవత్సరాల క్రితం వీరి ముత్తాతకి ఈ విత్తనం ఇచ్చారట! అప్పటినుండి అదే రకాన్ని వీరి కుటుంబం పండిస్తున్నారట. హనుమాన్‌రాం గత 45 సంవత్సరాల నుండి మేలైన గింజలను ఎంపిక చేసి, ప్రత్యేకమైన పంట గా వేస్తూ ఉత్తమమైన సజ్జ రకాన్ని 'సుల్కానియా' అనే పేరున రైతులకు అందజేస్తుంటాడు. ప్రతి సంవత్సరం పంట వచ్చిన తర్వాత ఆరోగ్యం గా వున్న గింజలను ఏరి, ఎండిన వేపాకులతో కలిపి నిలువ చేస్తాడు.



ఈవిధంగా 5 సంవత్సరాల వరకు నిలువ చేసుకోవచ్చు అంటాడితను.

ఈ 'సుల్కానియా' సజ్జ తొలకరి వర్షాలకు విత్తుకునే రకం. ఇది ఇసుకమట్టి నేలలు, నీరు తక్కువగా వున్న ప్రాంతాలలో, సమ ఉష్ణ ప్రాంతాలలో కూడా విత్తటానికి అనువైన రకం. వర్షపాతం తక్కువైన కరువు వాతావరణాన్ని కూడా తట్టుకుంటుంది. విత్తిన తర్వాత కొంత కాలం వర్షం లేకపోయినా ఇది బాగా మొలకెత్తి ఎదుగటం దీని ప్రత్యేకత. ఈ లక్షణాలు సాధారణ సజ్జ రకాలలో వుండవు.

ఈ రకం సజ్జతో హెక్టారుకు 20 నుండి 25 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధించవచ్చు. 20 నుండి 30 అంగుళాల పొడవాటి కంకులు, రుచిలో తియ్యదనం, గింజలు ఒత్తుగా వుండటం దీని ప్రత్యేకత. ప్రతి మొక్కకు 6 నుండి 10 కంకులు వస్తాయి. ప్రతి కంకిలో 90 శాతానికి పైగా మంచి బలమైన విత్తనాలే వుంటాయి. విత్తిన 90 రోజులకే పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 40 క్వింటాళ్ళ వరకు పశుగ్రాసం లభిస్తుంది.

వర్షాధారం బాగా వుంటే ఈ రకంలో ఇంకా ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చునని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు. ఇది సాధారణ రకంకన్నా ఎక్కువగా చీడ పీడలను తట్టుకునే శక్తి కలిగి వుంటుంది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో క్షేత్ర స్థాయిలో జరిపిన పరిశోధనా ఫలితాలను బట్టి చూస్తే వర్షాభావ పరిస్థితులలోనే మంచి ఫలితాలను ఇస్తున్న ఈరకం కొద్దిగా వర్షాలు ఎక్కువున్న ప్రాంతాలలో మరింత మెరుగైన ఫలితాలు ఉండవచ్చని అనుకుంటున్నారు రైతులు.

సుల్కానియా గ్రామ రైతులతో పాటు, శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్ర అధికారులు, సెంటర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ నిష్ణాతులు 'హనుమాన్ రాం రూపొందించిన ఈ సజ్జ రకం ఇతర రకాల విత్తనాల కన్నా చాలా మేలైనవని, అధిక దిగుబడిని ఇస్తున్నాయని, చీడ పీడలను బాగా తట్టుకోగలవని అన్నారు. ఆ గ్రామ రైతులు తాము కూడా దాదాపు 30 సంవత్సరాల నుండి ఆ విత్తనాలే వేస్తున్నామని వెల్లడించటం జరిగింది. బైట మార్కెట్‌లో లభించే హైబ్రిడ్ విత్తనాలకన్నా ఇవి ఎన్నోరెట్లు ఉత్తమంగా వున్నాయని రైతులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ విత్తనాలను అభివృద్ధి చేసినందుకు గాను ఎన్.ఐ.ఎఫ్. వారు 9వ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞాన పోటీల్లో ఇన్నోవేటర్ హనుమాన్‌రాం ఝూరియాను రాష్ట్ర స్థాయి పురస్కారంతో సత్కరించారు.

విత్తనాలు కావలసిన వారు **వీరరాఘవ రెడ్డి,**

**ఫోన్ : 8125799904, 7989038186 తో** సంప్రదించండి.



# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి

- వీరరాఘవ రెడ్డి


గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం **23** శాతం. అంటే **77** శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో **2021** జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## 'చీరల రోలింగ్' తో గ్రామీణ మహిళా యువతకు ఉపాధి

పూర్వం గుడ్డలను శుభ్రంగా ఉతుక్కోవడం, తొడుక్కోవడం చేసేవారు. గ్రామాల్లో అయితే ఈ పనంతా రజక వృత్తిదారులు చేసేవారు. కొంత కాలానికి గుడ్డలను 'ఇస్త్రీ' చేయటం మొదలైంది. పురుషుల దుస్తుల్లో ఈ ఇస్త్రీ విధానం ఇంకా అలాగే కొనసాగు తూ ఉన్నది కాని, మహిళల చీరల విషయంలో కొద్ది కొద్దిగా మార్పులు వస్తూ ఉన్నాయి. మొదట ఇస్త్రీ చేసే వారు, ఆ తర్వాత కొంత కాలానికి 'రోలింగ్' ప్రక్రియ మొదలైంది. ఈ రోలింగ్ ప్రక్రియ మొదట చీరను ఉతికి, ఆరబెట్టి, అవసరమైన వాటికి 'గంజి' కూడా పెట్టి, ఒక కర్రకు బిగుతుగా చుట్టడం చేసేవారు. ఈ పద్ధతి వల్ల పనిచేసే వారు కొద్దిగా ఎక్కువ అవసరం అవుతారు. కొంత కాలం కొనసాగిన తర్వాత ఈ చీరల రోలింగ్‌కు  ఇప్పుడు మార్కెట్లో యంత్రాలు వచ్చేసాయి. అందువల్ల ఈ పనిని మహిళలు, కొందరు నిరుద్యోగులు గృహ పరిశ్రమగా చేసుకుని ఉపాధి పొందుతున్నారు. వీరిలో చాలా వరకు పేద, మధ్య తరగతి వారే కావటం వల్ల 4–5 లక్షల ఖరీదు పెట్టి యంత్రాలు కొనే తాహతు లేక చీరలను కర్రలకు చుట్టే ప్రక్రియలోనే కొంత మార్పు చేర్పులు చేసి, తక్కువ మంది పనిచేసేలా చాలా ఇన్నోవేషన్లు చేశారు.

ఇన్ని రకాల పద్ధతులున్నా, చీర రోలింగ్ చేసిన తర్వాత వాటిలో నాణ్యత, ఆరబెట్టే సమయం విషయంలో పెద్దగా మార్పు తీసుకు రాలేక పోయారు. యంత్రాలపైన ఒకే వ్యక్తి పని చేయవచ్చు కాని, ఆరబెట్టే సమయంలో కొంత ఎక్కువ స్థలం, ఎక్కువ మంది కూడా అవసరం అవుతారు. ఈ రోలింగ్ ప్రక్రియ ఇప్పుడు చిన్న పట్టణాలకు కూడా ప్రాకింది. పట్టణాల్లో చీరలు ఆరబెట్టుకోవడానికి స్థలం లభించటం కొంత కష్టం. అయితే గ్రామాల్లో ఈ చీరల రోలింగ్ ప్రక్రియ ఏర్పాటు చేసుకున్నట్లయితే స్థలాభావ పరిస్థితులు లభించక పోవటం అనే సమస్య చాలా తక్కువగా ఉంటుంది. చీరలను 'రోలింగ్ చేస్తే అవి





షాపునుండి కొనుగోలు చేసిన కొత్త వాటిలా ఉంటాయి' కాబట్టి మహిళలు ఈ పద్ధతికి బాగా అలవాటు పడి పోయారు.

ఈ అవసరాలను గుర్తించిన ఇన్నోవేటర్ కడవ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఇన్నోవేటర్ శివచంద్ర ప్రసాద్ గతంలోని అన్ని ప్రక్రియలను మిళితం చేస్తూ, చీర నాణ్యత అద్భుతంగా ఉండేలా, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, ఒకే వ్యక్తి చీరల రోలింగ్ చేసేలా, మధ్య తరగతి వారు కూడా కొనుగోలు చేసుకుని ఉపాధి పొందేలా సరికొత్త యంత్రాన్ని అభివృద్ధి చేసాడు.

చీరలు రోలింగ్ చేయటానికి మార్కెట్‌లో 4-5 రకాల పద్ధతులు ఉన్నాయి. అందులో ఒకటి యంత్రం ఉండదు కానీ, చీరను ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కలిసి ఒక టబ్‌లో చీరకు అవసరమైన గంజి, చీర నాణ్యంగా కనిపించే కొన్ని రకాల రసాయనాలు వేసి చీరను అందులో అద్ది, బిగుతుగా ఒక కర్రకు చుట్టడం, దాన్ని ఎండలో ఆరబెట్టి ఆ తర్వాత దాన్ని విప్పదీసి చక్కగా మడతలు వేసి ఇవ్వటం ఒక పద్ధతి. ఇలా చీరలు రోలింగ్ చెయ్యటానికి వ్యాపారాన్ని బట్టి చీరలను చుట్టేందుకు కొన్ని కర్రలను తయారు చేయించుకోవాల్సి ఉంటుంది. ఇదంతా దాదాపు 20 నుండి 30 వేల వరకు ఖర్చవుతుంది.

మరో పద్ధతి ఇద్దరు వ్యక్తులు చీరను ఇరువైపుల ఒక కర్రకు బిగించి బిగుతుగా పట్టుకుంటే మరో వ్యక్తి చీరపైన అవసరమైన గంజి, రసాయనాలను స్ప్రే చేసి, ఆ చీరను చుట్టడానికి ఒక చట్రం ఏర్పాటు చేసుకుని ఉంటారు. దానికి చేతితో ఒక పెడల్‌ను తిప్పటం ద్వారా చీర కర్రకు చుట్టుకుంటుంది. ఈ పద్ధతికి కూడా దాదాపు 50 వేల వరకు ఖర్చవుతుంది.

ఒక చీర రోలింగ్ చేస్తే, ప్రాంతాలను బట్టి చీరకు రూ. 50 నుండి 100 రూపాయల వరకు తీసుకుంటారు. ఎక్కడ ఎంత సొమ్ము తీసుకున్నా, ఒక చీర రోలింగ్ చెయ్యాటానికి శివచంద్ర ప్రసాద్ తయారు చేసిన ఈ యంత్రం ద్వారా అయ్యే ఖర్చు కరెంటుతో సహా 10-15 రూపాయలకు మించదు. రోలింగ్ యంత్రంతో పాటు చీరలు చుట్టి ఆరబెట్టే రోలర్లు 5 ఇస్తాడు. గిరాకీ ఎక్కువగా ఉన్నవారు, ఆరబెట్టేందుకు కొద్దిగా స్థలం ఉన్నవారు ఇంకా ఎక్కువ రోలర్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక యంత్రానికి 10 రోలర్లు ఉన్నట్లయితే రోజుకు ఒక వ్యక్తి 8 పని గంటలలో 30-40 చీరలను రోలింగ్ చేసుకోవచ్చు. ఈ యంత్రం ఏర్పాటు చేసుకునేందుకు ఒక చిన్న బెడ్‌రూం అంత గది, రోలింగ్ చేసిన చీరలను ఆరబెట్టుకోవటానికి ఇంటిముందు లేదా వెనక లేదా ఇంటిపైన కొద్దిగా స్థలం ఉంటే చాలు. ఈ యంత్రం ఖరీదు దాదాపు రెండున్నర లక్షల దాకా ఉంటుంది.


**వెడల్పుగా చీరను శుభ్రం చేయడం (ఓపన్ విడ్త్ వాషింగ్):**

ఈ సౌకర్యం పాత యంత్రంలో లేదు. దానివల్ల కూడా కొంత సమయం వృదా అవుతుందని గ్రహించి నూతన యంత్రంలో ఈ ఏర్పాటు చేశాడు. ఇప్పుడు మార్కెట్‌లో వస్తున్న చీరలు అన్ని దాదాపు వాష్ చేసేటపుడు రంగులు వెలసి ఒక చీర రంగు ఇంకో చీరకు అంటుటుంటూ ఉంటాయి. అలా జరగకుండా ఈ యంత్రంలో ఒక మంచి పరిష్కారం చూపాడు శివచంద్ర ప్రసాద్. ఈ సౌకర్యం ఏర్పాటు



**చేతితో చీరను రోలింగ్ చెయ్యటానికి - ఈ యంత్రంతో చెయ్యటానికి మధ్య తేడా ఈ విధంగా ఉంటుంది.**

| వ. | వివరము | చేతితో చేసే పని | ఈ యంత్రం చేసే పని |
|---|---|---|---|
| 1. | అవసరమయ్యే మనుషులు | 3-4 | ఒక్కరు |
| 2. | ఒక చీర చేయటానికి పట్టే సమయం | 15-20 ని. | 5 నిమిషాలు |
| 3. | చీరకు పెట్టే గంజి | హెచ్చు తగ్గులుగా ఉంటుంది. | చీరంతా ఒకేవిధంగా ఉంటుంది |
| 4. | చీర రోలింగ్ వాడే కర్ర సైజు | 4 అంగుళాల చెక్క | 15 అంగుళాల చతురస్రాకారపు రోలర్ |
| 5. | పగటి సమయంలో చీర ఆరే సమయం | 10-12 గంటల సమయం (వాతావరణాన్ని బట్టి) | 3-6 గంటల సమయం (వాతావరణాన్ని బట్టి) |
| 6. | ఆరబెట్టే పద్ధతి | ఎండలో ఆరబెట్టాలి. అందువల్ల చీరల రంగు వెలిసిపోయే ప్రమాదం. | నీడలో అయినా ఆరబెట్టవచ్చు. అందువల్ల రంగులు వెలిసిపోవు. |
| 7. | అవసరమైన స్థలం | కనీసం 8-20 అడుగుల స్థలం అవసరం | 8-8 అడుగుల గది సరిపోతుంది |
| 8. | నాణ్యత | సాధారణంగా ఉంటుంది | కొత్త చీరలాగా మెరుస్తుంది |





చేయటం వల్ల కొత్త చీరలు లేదా రంగులు వెలిసే ప్రమాదం వున్న చీరలను వెడల్పుగా యంత్రానికి అమర్చి, అక్కడక్కడా చేతితో కుట్టు వేసి (మళ్ళీ విప్పడానికి అనువుగా ఉండేలా) యంత్రంలో త్రిప్పటం వల్ల చీరలోని రంగులు ఒకదానితో ఇంకో చీర రంగు అంటుకోకుండా బాగా వాష్ చెయ్యవచ్చు. వాష్ చేసిన తర్వాత చీరను ఆరబెట్టి అదే మిషన్‌లో రోలింగ్ లేదా పాలిష్ చెయ్యవచ్చు.

కొత్తగా అభివృద్ధి చేసిన యంత్రాన్ని తిరుపతి లోని ఒక మహిళా సమూహానికి విక్రయించటం జరిగింది. ఈ యంత్రంతో ఆ మహిళలు తక్కువ శ్రమతో, ఎక్కువ నాణ్యతతో చీరలను రోలింగ్ చేసి వారి చుట్టుప్రక్కల ప్రాంత మహిళల్లో మంచి పేరు సంపాదించుకుని, అధిక ఆదాయం పొందుతున్నారు.

ఇప్పటిదాకా 4 యంత్రాలను తయారు చేసి ఇచ్చాడు. వాటిని తీసుకున్న అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. చీర రోలింగ్‌లో నాణ్యత వల్ల తమకు గిరాకీ బాగా పెరిగిందని తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ పని చెయ్యటానికి ఎటువంటి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం లేకుండా ఒక మహిళ ఈ యంత్రంతో రోజుకు 40 చీరల రోలింగ్ చేసి, సరాసరిన చీరకు 100 రూపాయలు వేసుకున్నా రోజుకు 4 వేల వరకు సంపాదించుకోవచ్చు. అవసరమైన రసాయనాలు, కరెంటు ఖర్చు, యంత్రం కొనుగోలు, అరుగుదల ఖర్చులు అన్నీ పోను రోజుకు కనీసం వెయ్యి రూపాయల దాకా అంటే నెలకు 30 వేల దాకా ఆ మహిళ ఇంటివద్ద ఉండే ఎవ్వరి పైనా ఆధారపడకుండా మహిళలు తమ స్వంత కాళ్ళపై నిలబడి సంపాదించుకోవచ్చు.



ఈ వ్యాపారం గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే మహిళలకు 'పల్లెసృజన' ఒక మార్గాన్ని సూచిస్తోంది. మీ గ్రామంలోనే కొందరు యువకులను కమీషన్ ప్రకారం నియమించుకుని, వారు సమీప పట్టణాలకు వెళ్ళి, అపార్ట్‌మెంట్లు తిరిగి కావాల్సిన గిరాకీ తీసుకు వచ్చి ఇవ్వాలి. చీర రోలింగ్ అయిన తర్వాత మళ్ళీ వాళ్ళే వెళ్ళి వినియోగ దారులకు ఇచ్చి వచ్చేలా ఏర్పాటు చేసుకున్నట్లయితే గ్రామీణ యువతులు, మహిళలు ఇంట్లో తమ పనికి ఎటువంటి ఆటంకం కలగ కుండా అదనపు సంపాదన పొందవచ్చు. అలాగే మీ ద్వారా మీ గ్రామం లోని కొందరు యువకులకు ఉపాధి అందించిన వారవుతారు.

ఇటువంటి కొత్త ఆలోచనను గ్రామీణ లేదా చిన్న పట్టణాల్లోని మహిళలు, యువతులు మీ గ్రామానికి సంబంధించిన బ్యాంకులను సంప్రదించినట్లయితే వారు మీకు యంత్రాన్ని కొనుగోలు చేసుకునేలా అవసరమైన ఋణాన్ని కూడా ఇచ్చే అవకాశాలు ఎక్కువ. ఎందుకంటే ప్రస్తుతం ప్రభుత్వాలు, బ్యాంకులు గ్రామాల్లో యువతకు ఉపాధి లభించే ఏ అవకాశాన్ని వదలకుండా సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయి. కాబట్టి గ్రామాల్లోని మహిళలు, యువతులు మీకు అవసరమైన ఇద్దరు లేదా ముగ్గురు యువకులు జట్టుగా ఏర్పడి ఇటువంటి కొత్తరకం ఉపాధి పొందటం ద్వారా మీ గ్రామాల వద్ద ఉండే మీరు స్వయం ఉపాధి పొందాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ●

**ఈ యంత్రాన్ని ఏర్పాటు చేయాలి అనుకున్న వారు ఇన్నోవేటర్ శివచంద్ర ప్రసాద్, ఫోన్ : 96422 49555, వీర రాఘవ రెడ్డి, ఫొన్ : 81257 99904 లేదా సుభాష్ చందర్, ఫోన్ 9652801700 లను సంప్రదించవచ్చు.**

# జులై - ఆగస్టు 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు









జులై 5న టిఎస్ఐసి నుండి 35 మంది ఇన్నోవేషన్ మిత్ర బృందం 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించింది. బ్రిగేడియర్ గణేశం మరియు సుభాష్ చందర్ వారికి పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లపై అవగాహన కల్పించారు.



జులై 25న సుమన్ టీవీ సిఇఓ మరియు వారి బృందం పల్లెసృజన కార్యాలయానికి విచ్చేసి బ్రిగేడియర్ గణేశం గారితో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లపై ఒక వీడియోను తీయటం జరిగింది. ఆ సందర్భంగా సుమన్ టీవీ బృందంతో గణేశం గారు మరియు సుభాష్. ఈ కార్యక్రమం త్వరలో టెలికాస్ట్ అవుతుంది.





7 ఆగస్టు, 2024న న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో సి-20 లో భాగంగా జరిగిన 'ఐడియాస్ ఫర్ లైఫ్' పై జరిగిన సదస్సులో 'మిషన్ లైఫ్' యొక్క 7 స్తంభాలపై చర్చలు ప్రత్యేక దృష్టిని ఆకర్షించాయి. ఈ సమావేశంలో 'వ్యర్థాల నిర్వహణ నుండి ప్రవర్తనా శాస్త్రాల వరకు' వివిధ అంశాలపై ఆసక్తికరమైన ఆలోచనలు జరిగాయి. ఈ కార్యక్రమం లో 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు పాల్గొన్నారు.



జులై నెలలో 'ప్రవాహ' సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 'పల్లెసృజన' గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లపై అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నప్పటి చిత్రం.






ఆగస్టు 22, 23 తేదీల్లో వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'ఈ-సమ్మిట్ ఎగ్జిబిషన్'లో మన పల్లెసృజన ఇన్నోవేటర్లు పదిమంది పాల్గొన్నారు. 30 కి పైగా ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. ఇన్నోవేషన్లను గూర్చి చాలా మంది విద్యార్థులు, అధ్యాపకులు చాలా ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఇన్నోవేటర్లను వర్ధమాన్ కళాశాల వారు సత్కరించడం జరిగింది.







'పల్లెసృజన' ఇన్నోవేషన్లను గ్రామీణులకు ప్రత్యక్షంగా పరిచయం చెయ్యాలన్న కార్యక్రమంలో భాగంగా 9 ఆగస్టు, 2024న కర్నూలు జిల్లా మండల కేంద్రం 'గూడూరు'లో జరిగిన గ్రామ సంతలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో వందలాది మంది రైతులు పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లను తెలుసుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# ఇన్నోవేటర్ 'కొప్పుల అశోక్' మరో నూతన ఆవిష్కరణ

# హ్యాండ్ వీడర్ ను కూర్చుని నడిపే 'పవర్ వీడర్'గా మార్పు




- వీరరాఘవ రెడ్డి

మారుతున్న సమాజంలో పొలంలో చేతితో నడుపుకుంటూ హ్యాండ్ వీడర్‌తో వ్యవసాయం చేసే మనుషులు కూడా కరువు అవుతున్నారు. మరి కొందరు మహిళా వ్యవసాయదారులు తామే స్వయంగా పని చేసుకుంటున్నాము, కానీ నడుచుకుంటూ వీడర్‌తో సేద్యం చెయ్యాలి అంటే కష్టంగా ఉంది ఈ వీడర్‌నే కూర్చుని నడిపేదిగా తయారు చేయించండి అని కొందరు మహిళలు కోరటం జరిగింది. ఈ సమస్యను సవాలుగా స్వీకరించిన గుంటూరు జిల్లా నర్సారావు పేట సమీపంలో గల నాదెండ్ల మండలం, ఇర్లపాడు గ్రామాని కి చెందిన 'కొప్పుల అశోక్' అనే పల్లెసృజన పాఠకులకు చిరపరిచితుడైన ఇన్నోవేటర్ కూర్చుని నడిపేలా తన వీడర్‌ను రూపొందించాడు.

ఈ వీడర్‌ను ఉపయోగించి, ప్రత్తి, మిరప, పండ్ల తోటలలో అలుపు లేకుండా అంతర సేద్యాలు చేసుకుంటున్నారు. అంతే కాక, ఇదే వీడర్ వల్ల ఒకే ఒక వ్యక్తి కొన్ని అవసరమైన పనులకు ఒక సహాయకుడు ఉంటే చాలు, ఎన్నో రకాల వ్యవసాయ పనులు సునాయాసంగా చేసుకోవచ్చు.

**నారు నాటుకునేందుకు అచ్చులు:**

ఈ వీడర్‌తోనే పొలం లో మిరప, కూరగాయలు, పొగాకు, మొక్కజొన్న లాంటి పంటలకు విత్తనాలు, నారు నాటుకోవటానికి అవసరమైన అచ్చులను ఈ వీడర్‌తోనే చేసుకోవచ్చు. కూర్చుని నడిపేది కాబట్టి అలసట అనేది లేకుండా సాళ్ళను కూడా దారం పట్టినట్టు చక్కగా అచ్చులు వేసుకోవచ్చు.



**బోదెలు చేసుకోవటం:**

ఇదే వీడర్‌కు బోదెలు చేసుకునే పరికరం అమర్చుకుంటే బోదెలపై విత్తనాలు, నారు నాటుకోవాలి అనుకునే వారు, పొలంలో కలుపు సమస్య ఎక్కువగా ఉండి మల్చింగ్ పేపర్ వేసి నారు నాటుకోవాలి అనుకునే రైతులు సునాయాసంగా బోదెలు చేసుకోవచ్చు.

**రొటోవేటర్‌తో పొలం పొడిపొడిగా చేసుకోవటం:**

కొన్ని రకాల పంటలు వేసుకోవటానికి పొలంలో ఎక్కువగా మట్టి పెళ్లలు ఉన్నట్లయితే అటువంటి వాటిలో రైతులు మట్టి పొడిపొడిగా తయారు కావటానికి 'రొటోవేటర్'ను ఉపయోగిస్తారు. అటువంటి వారు ఇదే వీడర్‌కు రొటోవేటర్‌ను అమర్చుకుని తమ పొలంలోని మట్టి పెళ్లలను పొడిపొడిగా మారేలా చేసుకోవచ్చు.



**విత్తనం, ఎరువులు వేసుకుందుకు:**

ఈ వీడర్‌కు జడిగం అమర్చుకుంటే పొలంలో విత్తనాలు, పంటలకు ఎరువులను ఎటువంటి సహాయకుడు అవసరం లేకుండా ఒకే వ్యక్తి వేసుకోవచ్చు.



విత్తనాలు కూడా ఎంత దూరం, ఎంత వెడల్పు కావాలంటే అంత దూరం వేసుకునేలా సరిచేసుకోవచ్చు కూడా.

**అంతర సేద్యాలు:**

ఈ కూర్చుని నడిపే వీడర్‌తో అంతర సేద్యాలు చాలా సులభం గా చేసుకోవచ్చు. ప్రత్తి, మిరప, కూరగాయల తోటలు, పండ్ల తోటల్లో అంతర సేద్యాలు చేసుకుని కలుపు నివారణతో పాటు పొలాన్ని ఎటువం టి గడ్డి లేకుండా శుభ్రంగా ఉంచుకోవచ్చు.



**ట్రాలీ తగిలించుకుని రవాణా:**

ఈ వీడర్‌కు ట్రాలీని తగిలించుకుంటే చాలు పొలానికి అవసరమైన ఎరువులు, కూలీలు మరియు పొలం నుండి ఇంటికి వ్యవసాయ దిగుబడులు సులువుగా రవాణా చేసుకో వచ్చు. అవసరం అనుకుంటే వాటిని మార్కెట్‌కు కూడా తరలించుకోవచ్చు. ఎత్తు కూడా తక్కువగా ఉంటుంది కాబట్టి ట్రాక్టర్‌లకు లోడు చేయటానికి, అన్‌లోడ్ చెయ్యటానికి అవసరమైనట్టు కూలీలు కూడా అవసరం లేకుండా రైతే స్వయంగా ఈ వీడర్‌పై లోడ్ – అన్‌లోడ్ చేసుకోవచ్చు. పండ్ల తోటలు, కూరగాయల తోటల్లో పంట దిగుబడులను తెంపి ఒక బుట్టలో వేసుకుని గెట్టు వరకు తీసుకు రావాల్సిన అవసరం లేకుండా ఈ వీడర్‌ను పొలంలో నడుపుకుంటూ వెళ్తుంటే పండ్లు, కూరగాయలు తెంపిన కూలీలు వాటిని ఈ ట్రాలీలో వేస్తూ కష్టం లేకుండా వాటిని పొలం గెట్టుకు చేర్చుకోవచ్చు.



**పురుగు మందుల పిచికారి:**

ఇదే వీడర్‌కు స్ప్రేయర్‌ను తగిలించుకుంటే ఆ స్ప్రేయర్‌తోనే ట్యాంకులో పురుగు మందు వేసుకుని సమీపంలోని వాగు, వంకలు, కుంటల్లో నుంచి కేవలం డ్రైవరే నీటిని తోడుకుని వచ్చి, పొలంలో పురుగు మందు పిచికారి చేసుకోవచ్చు. స్ప్రేయర్‌తో పురుగు మందు పిచికారి చెయ్యాలంటే ఒక వ్యక్తి నీరు తెచ్చేందుకు, మరో వ్యక్తి పురుగు


స్ప్రేయర్

మందు నింపేందుకు అవసరం అవుతారు. కానీ, ఈ వీడర్‌తో స్ప్రే చెయ్యటానికి ఎటువంటి సహాయకుడు అవసరం లేదు.

**వరిచేలలో దమ్ము చేసుకోవటం:**

ఈ వీడర్‌కు ఉన్న టైరు చక్రాలను తీసివేసి, వాటి స్థానంలో ఇనుప కయ్యలు వేసుకుని వరి పొలాల్లో దమ్ము కూడా చేసుకోవచ్చు. చిన్నవిగా ఉన్న వరి మళ్ళల్లో ట్రాక్టరుతో దమ్ము చేయటానికి వీలుండదు. అటువంటి వాటిలో దమ్ము చేయాలంటే ఎద్దులతోనే చెయ్యాల్సి ఉంటుంది. కానీ, ఇది చిన్నదిగా ఉంటుంది కాబట్టి చిన్న చిన్న మళ్ళల్లో కూడా సునాయాసంగా దమ్ము చేసుకోవచ్చు.



**వరి మరియు గడ్డి కోతలు:**

ఈ వీడర్‌కే గడ్డిని కత్తిరించే పరికరం అమర్చుకుంటే వరి లేదా పశువుల గడ్డిని సులుసుగా ఒకే వ్యక్తి కోసుకోవచ్చు. కోత కోయ బడిన గడ్డి కూడా ఒకేవైపుకు పడుతూ ఉంటుంది కాబట్టి దాన్ని చేత్తో ఎదురుకొని ఇదే వీడర్‌కు ట్రాలీ తగిలించుకుని, అందులో వేసుకుని ఇంటికి చేర్చుకోవచ్చు.

ఇలా రైతుకు అవసరమైన ఎన్నోపనులను సులభంగా, ఎటు వంటి అలసట, ఎవ్వరి సహాయం లేకుండా ఒకే వ్యక్తి చేసుకునేలా వీడర్‌ను రూపొందించిన ఇన్నోవేటర్ 'కొప్పుల అశోక్'కు అభినందనలు తెలియజేస్తోంది 'పల్లెసృజన'. దీన్ని ఉపయోగించుకుంటున్న రైతులు కూడా ఎవ్వరు సహాయకులు లేకుండా తమ పనులను తామే స్వయంగా, అలసట లేకుండా చేసుకో గలుగుతున్నామని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిన్న కమతాలున్న రైతులు, మహిళా రైతులు ఈ వీడర్‌ను ఉపయోగించుకుని తమ వ్యవసాయ కష్టాల నుంచి బయట పడాలని, తమ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని లాభాల బాట పట్టాలని కోరుకుం టోంది పల్లెసృజన. ●

**ఈ వీడర్ కావలసిన వారు సంప్రదించండి :**

**ఇన్నోవేటర్ కొప్పుల అశోక్, ఫోన్ : 82978 68863, వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904/ సుభాష్, ఫోన్ : 96528 01700**



## రసాయన పురుగు మందు అవసరం లేని మరో 'సివిఆర్' ఇన్నోవేషన్

# 'మట్టి - ఆముదం - కుంకుడు' ద్రావణం

'పద్మశ్రీ' చింతల వెంకట్ రెడ్డి (సివిఆర్)

- వీర రాఘవ రెడ్డి

పల్లెసృజన పాఠకులకు 'చింతల వెంకట్ రెడ్డి' పద్మశ్రీ పురస్కార గ్రహీత గారి పేరు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆయన ఇప్పటికే మట్టి ద్రావణంపైన ఎన్నో రకాల ప్రయోగాలు చేసి, యావత్ భారత దేశ రైతాంగం హృదయాల్లో ఒక మంచి స్థానాన్ని సంపాదించుకున్నారు. రైతులు రసాయన పురుగు మందులను వినియోగించి నష్టాల పాలు కావటమే కాకుండా సమాజానికి విషతుల్యమైన ఆహారాన్ని అందిస్తున్నారని, వారిని నష్టాల బారి నుండి కాపాడేందుకు, సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు ఎన్నో ప్రయోగాలు చేశారు. ఈ ప్రయోగాలన్నీ విజయవంతం కావటంతో భారత ప్రభుత్వం కూడా చింతల వెంకట్ రెడ్డి గారిని 'పద్మశ్రీ' పురస్కారం తో గౌరవించిన విషయం అందరికీ తెలుసు.

చింతల వెంకట్ రెడ్డి గారు తన 'మట్టి' ప్రయోగాల నిరంతర ప్రక్రియలో ఇటీవల మరో నూతన ప్రయోగం చేసి, అద్భుతమైన ఫలితం రాబట్టారు. ఈ విషయాన్ని మరి కొందరు రైతులకు విపులంగా విశదీకరించగా, వారు కూడా తమ క్షేత్ర ప్రయోగం చేయటం, అది విజయవంతం కావటంతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ



సివిఆర్ గారి మొక్కజొన్న మట్టి ద్రావణం స్ప్రే చెయ్యక ముందు



మట్టి ద్రావణం స్ప్రే చేసిన వారం రోజుల తర్వాత



ఈ ద్రావణం పిచికారి చేసిన టమోట పంటలో కేవలం 10 రోజుల్లో వచ్చిన మార్పు

క్రొత్త ప్రయోగం వల్ల రైతులు వేలు, లక్షల రూపాయలు రసాయన పురుగు మందులకు వినియోగించే బదులు కేవలం కొన్ని వందల రూపాయలతో తమ పంట పొలాలను కాపాడుకుని పెట్టుబడి ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

చింతల వెంకట్ రెడ్డి గారు ఈ ద్రావణాన్ని తయారు చేసి మొదట తన మొక్కజొన్న పంట పైన ప్రయోగించి చూశాడు. కేవలం వారం నుండి 10 రోజుల్లోనే పంటలో విపరీతమైన మార్పును గమనించాడు. అంతకు ముందు మొక్కజొన్న ఆకులను పురుగులు తినటం, పంట పసుపు పచ్చగా ఉన్నపుడు ఈ ద్రావణం పిచికారి చేశాడు. కేవలం వారం నుండి పది రోజుల్లోనే ఆ పంట పచ్చదనంతో కళకళలాడుతూ, ఆకులు కూడా వెడల్పుగా రావటం అంటే పంటలో మంచి ఎదుగుదలను గమనించాడు. ఈ ప్రయోగం విజయవంతం కావటంతో. దీన్ని మరి కొందరు రైతులకు చెప్పి వారి ద్వారా కూడా ప్రయోగించి చూస్తే బావుంటుందని అనంతపురం జిల్లాకు చెందిన 'గిరీష్' అనే రైతు, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన 'యష్‌రాజ్ సిన్హా గోష్లీ' అనే రైతులకు వివరించాడు. వారి ప్రయోగాలు కూడా విజయవంతం కావటంతో ఈ విషయాన్ని 'పల్లెసృజన'తో పంచుకున్నాడు చింతల వెంకట్ రెడ్డి.

చింతల వెంకట్ రెడ్డి గారి 'నూతన ప్రయోగ విధానం' :

లోపలి మట్టి (బాగా జిగటగా ఉండే మట్టి) 10 కిలోలు (ఒక తట్టెడు) తీసుకుని దాన్ని ఒక కర్రతో మెత్తగా చేయాలి. ఆ మట్టిలో 250 మి.లీ. నుండి 500 మి.లీ. వరకు ఆముదం కలిపి ఉంచాలి. 250 నుండి 500 గ్రా. కుంకుడు కాయలు తీసుకుని తగినంత నీటిలో వాటిని రాత్రంతా నానబెట్టాలి. ఉదయానికల్లా ఆ కుంకుడు కాయలు మెత్తగా తయారై ఉంటాయి. వాటిని చేతితో బాగా పిసికి పేస్టులాగా తయారు చెయ్యాలి. ఆ తర్వాత అందులో వున్న విత్తనాలను తీసి పక్కన వేయాలి. అలా తయారైన పేస్టును ముందు రోజు ఆముదం కలిపిన మట్టిలో వేసి బాగా కలగలపాలి. ఈ మిశ్రమాన్ని తీసుకుని 200 లీటర్ల నీటిలో వేసి ఒక కర్రతో బాగా కలపాలి. మట్టి మిశ్రమం అంతా నీటిలో బాగా కలిసిన తర్వాత కొద్దిసేపు వేచి ఉన్నట్లయితే అందులోని మట్టి రేణువులు అన్నీ


మట్టి, ఆముదము, కుంకుడు ద్రావణం తయారీ

క్రిందకు వెళ్ళి తేరుకున్న నీటిని స్ప్రేయర్లో వడకట్టి వేసుకుని పంటపై పిచికారి చెయ్యాలి. రైతులు ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే మట్టి ద్రావణం నీటిలో కలిపిన తర్వాత 4 గంల లోగా పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఆలస్యం అయినట్లయితే మట్టిలో కలిసిన ఆముదం ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి రైతులు మట్టి మిశ్రమాన్ని తయారు చేసుకున్న తర్వాత ఎప్పటికప్పుడు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాల్సి ఉంటుంది.

**ప్రయోగించిన రైతులు వారి పంటలపై వాటి ప్రభావం:**

ఈ ప్రయోగాన్ని చింతల వెంకట్ రెడ్డి గారి ద్వారా తెలుసుకున్న అనంతపురం జిల్లాకు చెందిన 'గిరీష్' అనే రైతు తన ప్రత్తి పంటపై నాటిన 15వ రోజు మట్టి, ఆముదం, కుంకుడు కాయల మిశ్రమాన్ని పిచికారి చేయటం జరిగింది. ఆ పంట ఇప్పుడు 50 రోజులకు పైగా అయినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి పురుగు కాని, దోమ కాని తన పంటకు సోకలేదని, ప్రస్తుతం తన ప్రత్తి పూత దశకు చేరుకుందని అన్నాడు. చింతల వెంకట్ రెడ్డి గారికి ఈ విషయం తెలియజేయగా ఇప్పుడు మళ్ళీ ఒకసారి అదే ద్రావణాన్ని పిచికారి చెయ్యమని సలహా ఇచ్చాడు ఒకటి రెండు రోజుల్లో రెండవ సారి అదే మట్టి ద్రావణాన్ని పిచికారి చేస్తాను అన్నాడు. కానీ ప్రత్తి పగలటం మొదలయ్యే లోపలే ఈ ద్రావణాన్ని పిచికారి చెయ్యాలని సూచించాడు వెంకట్ రెడ్డి. ఎందుకంటే ప్రత్తి పగిలిన తర్వాత ఈ ద్రావణం పిచికారి చేస్తే ప్రత్తిపైన మట్టి అవశేషాలు అలాగే ఉంటాయి కాబట్టి ధర తక్కువ వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి ప్రత్తి పగిలిన తర్వాత ఈ ద్రావణం పిచికారి చెయ్యవద్దు అని చెప్పారు.


గిరీష్ పత్తి పంట

రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన 'యష్‌రాజ్ సిన్హా గోష్లీ' అనే రైతు ఈ ప్రయోగాన్ని తన వేరుశనగ పంటపై ప్రయోగించి, తన అనుభవాలను పల్లెసృజనతో పంచుకున్నాడు. చింతల వెంకట్ రెడ్డి గారు చెప్పినట్లే మట్టి, ఆముదము, కుంకుడు కాయల మిశ్రమాన్ని తన వేరుశనగ పంటపై పంట విత్తిన 20 రోజుల తర్వాత పిచికారి చేశానని, ప్రస్తుతం పంట వయసు 55 రోజులు అని, ప్రస్తుతం రెండవసారి అదే మట్టి మిశ్రమ ద్రావణాన్ని పిచికారి చేస్తున్నాను అన్నాడు. ఇంత వరకు తన వేరుశనగ పంటకు ఎటువంటి పురుగు కాని, దోమ కాని సోకలేదు సరికదా, పంట కూడా పచ్చదనంతో చాలా ఆహ్లాదంగా కనిపిస్తోంది. పంట పూర్తయ్యే లోపు మరో ఒకటి లేదా రెండుసార్లు పిచికారి చేస్తానని, పంట దిగుబడి ఎలా ఉంటుందో కూడా పంట కోసిన వెంటనే తెలియ జేస్తాను అన్నారు యష్‌రాజ్ సిన్హా.



ఇక్కడ రైతులు గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే సాధారణంగా ప్రత్తి పంట అంటేనే వేలాది రూపాయల పురుగు మందులు కొని, ఒక పంట కాలంలో కనీసం 30 నుండి 40 సార్లు పురుగు మందు స్ప్రే చేస్తారు. అటువంటిది ప్రత్తి మొత్తం పంట కాలంలో కేవలం 3 లేదా 4 స్ప్రేలతోనే పంట చేతికి వస్తుంది అంటే రైతులు ఎంత శ్రమ, డబ్బు ఆదా అవుతుందో గమనించ గలరు. అలాగే వేరుశనగ పంట కూడా ప్రస్తుత కాలంలో కనీసం 3-4 పర్యాయాలు పురుగు మందులను పిచికారి చెయ్యకుంటే పంట దిగుబడి వచ్చే పరిస్థితులు ఇప్పుడు లేవు. అలాంటి ఈ మట్టి, ఆముదము, కుంకుడు కాయల మిశ్రమ ద్రావణం వల్ల పంట ఆరోగ్యంగా ఎటువంటి పురుగుల బాధ లేకుండా పెరుగుతుంది అంటే దిగుబడి కూడా చాలా బాగా రావచ్చనే ఆశతో ఉన్నారు ఈ ఇద్దరు రైతులు. ఈ మట్టి ద్రావణాన్ని కేవలం ఒక్క మల్బరీ పంటపైన తప్ప మిగతా అన్ని పంటలపైన ప్రయోగించవచ్చు.

ఈ మట్టి మిశ్రమ ద్రావణాన్ని తన పొలంలో నాటిన టమోట పంటపైన కూడా ప్రయోగించానని, పంట చాలా బాగా ఉండటంతో పాటు పండ్లు కూడా నాణ్యతతో కూడి ఉన్నాయని అన్నారు చింతల వెంకట్ రెడ్డి. ఈ ప్రయోగాన్ని అందరు కూరగాయలు పండించే రైతులు వినియోగించుకున్నట్లయితే అనవసరపు రసాయన మందుల ఖర్చులు విపరీతంగా తగ్గటంతో పాటు కూరగాయలు అంటే అందరూ తమ ఆహారంలో వినియోగించుకునేవే కాబట్టి ఆరోగ్యకరమైన కూరగాయలను అందించిన వారు అవుతారని కాబట్టి అందరు కూరగాయలు, మిరప, పండ్ల తోటలైన మామిడి, చీని, నిమ్మ, దానిమ్మలతో పాటు అన్ని రకాల పండ్ల తోటలపై ఈ మట్టి మిశ్రమాన్ని పిచికారి చేసి, సమాజానికి రసాయన రహిత పదార్థాలను అందించి, అందరూ ఆరోగ్యంగా ఉండేలా చేయాలని కోరుకుంటున్నారు చింతల వెంకట్ రెడ్డి గారు.

మట్టి, ఆముదము, కుంకుడు రసం మిశ్రమం అద్భుతంగా పని చేస్తుందని వ్యాసాలు, కథనాలు వ్రాయటం కాదు, స్వయంగా ప్రయోగించి చూడాలని ఈ వ్యాస రచయితగా నేను (వీరరాఘవ రెడ్డి) నా ఇంటి పెరటిలో వున్న చెట్లపై చింతల వెంకట్ రెడ్డి గారు చెప్పిన





పిచికారి చేసిన కేవలం 12 గంటల లోపు చనిపోయిన పురుగు

ద్రావణంలోనే మన ఇన్నోవేటర్ వెంకట కృష్ణ తయారు చేసి, గత 8 సంవత్సరాలుగా అద్భుత ఫలితాలు అందిస్తున్న "తులసి" ద్రావణం కూడా కలిపి పిచికారి చేయటం జరిగింది. పిచికారి చేసిన తర్వాత నేను గమనించింది ఏమిటంటే, నాకున్న 40 సంవత్సరాల వ్యవసాయ అనుబంధంలో ఏ పురుగు మందు కూడా సాయంత్రం పంటపై పిచికారి చేస్తే ఉదయానికి 'పొగాకు లద్దె పురుగు' (ఆకులను తినే పురుగు) దాదాపు చిటికెన వేలంత పరిమాణంలో వున్న పురుగులు చనిపోవటం నేను చూడలేదు. అత్యంత సాంద్రత కలిగిన ప్రమాదకరమైన 'పైరిత్రాయిడ్' పురుగు మందు 'సైఫర్ మైత్రిన్, ఫెన్‌వాలరేట్' లాంటి వాటిని కూడా ప్రయోగించి చూశాను. అవి కూడా చంపలేని పురుగులను కేవలం 12 గంటల లోపే చనిపోయేలా చేసిన ఈ ప్రకృతి ఆధారిత మిశ్రమం అని సగర్వంగా చెప్పగలను. ఇంతటి అద్భుతమైన, మన పొలంలోనే లభించే పరిష్కారాన్ని అందరు రైతులు వినియోగించుకో గలిగితే రైతులు ఇక పురుగు మందుల దుకాణాలకు వెళ్ళవలసిన అవసరమే ఉండదు అని ఖచ్చితంగా చెప్పగలను.

ఈ వ్యాసం వ్రాసే సమయంలో ఎందరో రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నాను. దాదాపు అందరు సేంద్రియ రైతులు చెప్పింది ఒక్కటే "రైతులు మొట్టమొదట చెయ్యాల్సిన పని 'రసాయన పురుగు మందులు అమ్మే దుకాణదారులను సలహాలు అడగటం మానేయాలి' అప్పుడే సేంద్రియ వ్యవసాయం వర్ధిల్లుతుంది" అన్నారు నాగార్జున సాగర్‌కు చెందిన రైతు మధుసూధన్ రెడ్డి అనే రైతు.

చింతల వెంకట్ రెడ్డి గారి ఈ ప్రయోగం విజయవంతమై, సమస్త రైతాంగం ఉపయోగించటానికి, దాన్ని వాడే పద్ధతి పరిణతి చెందే వరకు మనమంతా ఈ ప్రయోగాలను చేయడానికి రైతాంగాన్ని ప్రోత్సహించాలి. వాడే పద్ధతి, ప్రయోగ వివరాలు, వివిధ పంటలకై ప్రత్యేకతలు, దిగుబడి లాంటి వన్నీ సంపూర్తిగా గమనించి గ్రంథస్తం చేయాలి. అలా నిరూపించబడిన పద్ధతిని అందరూ వాడేలా విస్తరింప జేయాలి. మీ అందరి సహకారం రైతాంగానికి లాభకరమైన ఈ ప్రయోగానికి లభిస్తుందని పల్లెసృజన ఆశిస్తోంది. ●

**వివరాలకు : వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904**

# పల్లె జ్ఞానం

- హనీబీ ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**రసంపీల్చే పురుగు, గొంగళి పురుగు నివారణకు:**

ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి పంటలకైనా నష్టం చేసేవి రసంపీల్చే పురుగులు, గొంగళి పురుగులు. వీటి నివారణకి రకరకాల పద్ధతులున్నా, గుజరాత్ రాష్ట్రంలోని జాంనగర్ జిల్లా కళ్యాణ్‌పూర్ తాలూకాకి చెందిన 'పర్బత్ భాయ్ హోజీభాయ్ భాటియా' పూర్తి సేంద్రియ పద్ధతిలో చాలా విజయవంతంగా ప్రయోగించి సఫలం చెందుతున్నాడు. ఆయన పద్ధతి ప్రకారం ఒక కిలో వేప ఆకులు, కిలో సీతాఫలం ఆకులు, కిలో ఉమ్మెత్త ఆకులు, కిలో కలబంద ఆకులకి 250 గ్రా. ఉల్లి, 250 గ్రా. ఎండుమిర్చి, 250 గ్రా. వెల్లుల్లి, 200 గ్రా. పొగాకు పొడిల మిశ్రమానికి 10 లీటర్ల నీటిని చేర్చి మూతపెట్టిన బాండాలో సన్నని సెగపై మరిగించాలి. బాగా మరిగిన తర్వాత మిశ్రమాన్ని చల్లార్చి వడకట్టాలి. ఈ వడకట్టిన మిశ్రమంలో 2 లీటర్ల గోమూత్రం, 250 గ్రా. బెల్లం చేర్చి బాగా కలియతిప్పాలి. ఈ మిశ్రమాన్ని పంటపై పిచికారి చేస్తే రసంపీల్చే పురుగులు, గొంగళి పురుగులను సమర్థవంతంగా నిర్మూలించవచ్చు.

**పశువులలో అతిసార నివారణకు చింతచెట్టు బెరడుతో చికిత్స:**

కొన్నిసమయాలలో పశువులు పచ్చిమేత ఎక్కువగా తిని, లేదా చెడిపోయిన, కుళ్ళిపోయిన పదార్థాలు తిన్న ఫలితంగా అతిసార వ్యాధి బారిన పడుతుంటాయి. పేడలో దుర్భరమైన వాసన వుండి, రక్తము, చీము కూడా పడుతూ వుంటాయి. దీనికి సరియైన జాగ్రత్త తీసుకోకపోతే పశువు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. దీని నివారణకై మంజులా భేన్ చింతచెట్టు బెరడును వాడుతుంది. ఆమె 500 గ్రా. చింతచెట్టు బెరడును తీసుకుని బాగా ఎండబెట్టి, కాల్చి బూడిద చేస్తుంది. రెండు స్పూన్ల ఈ బూడిదలో 300 మి.లీ. నీటిని జోడించి, బాగా కలిపి పశువుకి రోజుకి రెండుసార్లు చొప్పున రెండు రోజులపాటు తాగిస్తుంది. దీంతో మంచి ఫలితం ఉంటుంది. తానీ పద్ధతిని తన తండ్రివద్ద నేర్చుకున్నానని, ఇప్పటికీ ఇదే వాడుతున్నానని చెప్పారు గుజరాత్ రాష్ట్రానికి చెందిన **మంజులాబేన్ ధీరూభాయ్ పటేల్**. వైద్యం జరుగుతున్నపుడు పశువుచేత ఏవిధమైన పచ్చిదాణా తినిపించకూడదు. నీరు మాత్రం సమృద్ధిగా తాగిస్తూ వుండాలని జాగ్రత్తలు చెప్పిదామె.



**పశువు తిరిగి చూలుకు రాకపోతే నెమలి ఈకతో వైద్యం:**

ఒకసారి ఈనిన పశువులు ఒక్కొక్కప్పుడు రెండవసారి చూలుకు రావటం ఆలస్యమవుతూ వుంటుంది. ఇటువంటి సందర్భాలలో తాను చెప్పిన చిట్కా వాడితే మంచి ఫలితం ఉంటుందని ఈ పద్ధతిని మేమూ పరీక్షించి సఫలీకృతమైనామని చెప్తున్నారు ప్రతాప్‌జీ ఠాకూర్, కాలోజీ ధాంజీ ఠాకూర్, కానాభాయ్, ఖేంగాభాయ్, బార్వాద్‌లు. ఈ సమస్య నివారణకు నెమలి ఈకలోని వెంట్రుకల కొనభాగాలను కత్తిరించి, సజ్జ రొట్టెలలో చుట్టి పశువుచేత తినిపించాలి. ఇలా ఒక్కసారి మాత్రమే చేయాలి. దీనివలన పశువు తిరిగి చూలుకు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయి.



**వంగ తోటలో ఆకుముడత పురుగు నివారణ:**

వంగ తోటల్లో ఆకుముడత తెగులు పెద్ద సమస్యగా వుంటుంది. వాతావరణం మబ్బుగా వుండి, మంచు ఎక్కువ కురుస్తున్న ప్రదేశాలలో రసం పీల్చే పురుగు చేరి ఆకుముడతకు దారి తీస్తుంది. దీనివలన వంగచెట్టు కొత్త ఆకులు వేయలేదు, చిగురు కూడా రాదు. పర్యావసానంగా పంట దిగుబడి దెబ్బతింటుంది. ఇటువంటి పరిస్థితుల్లో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ భాయ్ రాబరి జిల్లేడు, గన్నేరు, గోమూత్రం, నాచు ఉపయోగించి స్వంతంగా క్రిమి సంహారణిని తయారు చేసుకుంటారు.

రెండున్నర కిలోల జిల్లేడు ఆకులు, రెండున్నర కిలోల గన్నేరు ఆకులను మెత్తగా నూరి, ఆ మిశ్రమానికి 10 లీటర్ల నీటిని జోడించి సన్నని సెగపై చాలాసేపు మరగనివ్వాలి. చల్లారిన తర్వాత ఆ మిశ్రమంలో రెండున్నర లీటర్ల గోమూత్రము, ఒక కిలో నాచు/ పాచిని కలిపి 24 గంటలసేపు కదలకుండా ఉంచాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, 500 మి.లీ. ద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలి. ఈవిధంగా రోజు విడిచి రోజు చొప్పున ఆరు రోజులపాటు పిచికారి



చేయాలి. దీనితో పంటను ఆశించిన తెగులు నశించి కొత్త చిగురు వేసి పంట పూతకు వస్తుంది.

ముఖేష్‌భాయ్ రాబరీ తనకున్న 5 బీగాల పొలంలో కాయగూరలే కాక, పశువులకై గడ్డిని కూడా పెంచుతూ వుంటాడు. మూడవ తరగతి వరకే చదువుకున్న ఇతను గత 32 సంవత్సరాలుగా కొత్త విషయాలను తెలుసుకుని సేంద్రియ వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంభిస్తూ వుంటాడు.

**కాయగూరల్లో తెల్లదోమ నివారణకి మందు:**

చలికాలంలో చిక్కుడు మరియు ఇతర కూరగాయల పంటలకి తెల్లదోమ, రసంపీల్చే ఆకుపచ్చ పురుగులు సాధారణంగా ఆశిస్తూ వుంటాయి. నీరుపెట్టే పంటలపై ఇవి ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ఇటువంటి పరిస్థితి వచ్చినపుడు గుజరాత్‌కు చెందిన మంగళ్‌భాయ్ బూయా వేపాకు, గోమూత్రంతో క్రిమి సంహారక మందును తయారు చేసుకుంటూ వుంటాడు. ఆయన తన వంగ, చిక్కుడు పొలంలో ఈ తెల్లదోమ, రసంపీల్చే పురుగులు కనిపించి నపుడు 5 కిలోల వేపాకులను తీసుకుని రోట్లో వేసి కాస్త నజిగిజిగా దంచిన ఆకును 10 లీటర్ల నీటిలో కలిపి 2 రోజులు మురగబెడ్తాడు. ఆ తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి ఈ మిశ్రమానికి 3 లీటర్ల గోమూత్రాన్ని కలుపుతాడు. 20 లీటర్ల నీటికి ఈ ద్రావకాన్ని ఒక లీటరు చొప్పున కలిపి పురుగు సోకిన పంటపైన మూడురోజులకొకసారి చొప్పున పురుగు నశించేంత వరకు పిచికారి చేస్తూ వుంటాడు. కొన్ని సమయాలలో ఈ రసంపీల్చే పురుగు నాశనం కాకపోయినా, ఈ మందులోని చేదు రుచి వలన అవి మొక్కల రసాన్ని పీల్చటం మానేస్తాయి. ఈ ద్రావణం క్రిమి సంహారిగానే కాకుండా మొక్క ఎదుగుదలకు కూడా తోడ్పడుతుంది. ఈ పద్ధతిని తమ పూర్వీకులనుండి పాటిస్తున్నామని చెప్తున్నాడు మంగళ్‌భాయ్.



**మీ చిట్కాలను 'పల్లెసృజన'కు తెలియజేయండి**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇటీవల సేంద్రియ వ్యవసాయం బాగా అభివృద్ధి చెందుతోంది. ఈ విధానంలో మీరు కూడా ఏవైనా వినూత్న పద్ధతులను పాటించి, మీ పంటలను రక్షించుకున్న విధానం, మీ పశువులకు చేసిన వైద్య వివరాలను 'పల్లెసృజన'తో పంచుకోండి. వాటిని మన పత్రికలో ప్రచురిస్తాము. వాటిని ఇతర రైతులు కూడా ఆచరించి, తాము కూడా లాభం పొందుతారు. ఈ విధంగా మీరు అందించిన చిట్కాలు సమాజానికి ఎంతో ఉపయోగ పడటంతో పాటు, వారికి ఆర్థికంగా మానసికంగా లాభాలను చేకూరుస్తాయి. -ఎడిటర్

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత 18 సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 18 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరిం చాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంలో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందు బాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. మీకు ఎటువంటి సాంకేతిక పరమైన అవసరాలున్నా'పల్లెసజన' ను సంప్రదిం చడానికి సంశయించకండి. సమస్య పరిష్కారానికి మీ ఆలోచనను తెలియజేసినా, అది కార్యరూపం దాల్చేలా చేద్దాం.

-పల్లెసృజన.

వాట్స్ యాప్ నంబర్లు :

బ్రిగేడియర్ గణేశం, 9866 00 1678, వీరరాఘవ రెడ్డి: 81257 99904 / 79890 38186

## 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లతో

# మిర్చి రైతులకు ఎకరాకు 23 వేల పెట్టుబడి తగ్గింపు



మిర్చి పంట పండించటంలో ఖర్చులు విపరీతంగా పెరిగి పోతున్నాయి. తెగుళ్ళు, పురుగులను నియంత్రించే ఖర్చులతో పాటు, కూలీల ఖర్చు కూడా రైతుకు భారంగా మారుతోందని గత సంవత్సరం నుంచి రైతులు 'పల్లెసృజన'కు ఫోన్ ద్వారా, ప్రత్యక్షంగా తమ సమస్యలను గురించి చెప్పడం జరిగింది. ఈ సమస్యకు పరిష్కారం 'పల్లెసృజన' వద్ద ఉండి కూడా దాన్ని వారి వద్దకు చేర్చడంలో ఎక్కడో తేడా జరుగుతోందని గ్రహించింది. మొత్తం మిర్చి పంట పై మన పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లు ఏ విధంగా పని చేస్తాయి అన్న విషయాన్ని పరిశీలించి, మొత్తం పంట కాలంలో మిర్చి పంటలో రైతులు చేసే పనులు, ప్రస్తుతం వారు చేస్తున్న విధానంలో అయ్యే ఖర్చులు రైతుల ద్వారా సేకరించింది. రైతులు చెప్పిన ఖర్చులను – పల్లెసృజన ఇన్నోవేషన్లను ఉపయోగించటం ద్వారా అయ్యే ఖర్చులను బేరీజు వేసి ఒక ప్రణాళిక సిద్ధం చేయటం జరిగింది. ఈ ప్రణాళికను రైతులందరూ జాగ్రత్తగా పరిశీలించి, గ్రామానికి **10** మంది రైతులు కలిసి చర్చించి ఆచరణ సాధ్యమయ్యే పని అవునా కాదా అని మీరే బేరీజు వేసుకోవాలని కోరుకుంటోంది పల్లెసృజన. ఈ ప్రణాళికపై చర్చకు, సంప్రదింపులకు పల్లెసృజన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటుంది.

### 'పల్లెసృజన' మిరప రైతుల కిట్

**మిరప పంట : 1. నారు పోయటం, 2. పొలం సిద్ధం చేయటం, 3. నారు నాటడం, 4. అంతర సేద్యాలు, 5. పురుగు మందులు (సస్యరక్షణ), 6. కలుపు తీయటం, 7. కాయలు కోయటం, 8. అరబెట్టే స్థలానికి చేర్చటం, 9. అరబెట్టడం, 10. సంచులకు నింపటం, 11. ఇంటికి / మార్కెట్‌కు తరలించటం.**

| పని | ప్రస్తుతం రైతులు అవలంభిస్తున్న పద్ధతి | ఖర్చు రూ.లలో | పల్లె సృజన పద్ధతి | ఖర్చు రూ.లలో |
|---|---|---|---|---|
| 1.నారు పోయడం : | మిరప నారు పోయాలంటే అందుకు బోదెలు (బెడ్) తయారు చేసుకోవాలి. అందుకు ముందుగా పొలాన్ని దున్ని, మనుషుల చేత బెడ్‌లు వేయిస్తారు ఇలా చేయాలంటే 5 ఎకరాలకు నారుమడులు తయారు చేయటానికి కనీసం 10 మంది కూలీలు అవసరం అవుతారు. ఒక్కో వ్యక్తి కూలీ రూ. 500 కి పైగానే ఉంటుంది. | | పల్లెసృజన ఇన్నోవేటర్లు తయారు చేసిన వీడర్‌తో పొలం దున్ని, ఆ తర్వాత ఆ వీడర్‌కు బెడ్‌మేకర్ తగిలిం చుకుంటే కేవలం ఇద్దరు వ్యక్తులు నారు పోసేందుకు అవసరమైన బెడ్‌ను తయారు చేసుకోవచ్చు. | |
| | | | ■ ఇద్దరు వ్యక్తుల కూలీ | 1,000/- |
| | ■ ముందుగా బెడ్ తయారు చేసేందుకు అక్కడి పొలం దున్నాలి. అందుకు ఒక జత ఎద్దులు / ట్రాక్టరు అవసరం అవుతాయి. | | ■ వీడర్ కిరాయి | 1,500/- |
| | | | (ఇందుకు సమయం కేవలం ఒక్క రోజు) | |
| | ఎద్దులు/ ట్రాక్టర్ కిరాయి | 1,500/- | | |

■ ఒక్కో కూలీ ఖరీదు రూ. 500/-=10 మంది : 5,000/-
(ఇందుకు సమయం 2-3 రోజులు)
**■ మొత్తం ఖర్చు 5 ఎకరాలకు : 6,500/-**

**■ మొత్తం ఖర్చు : 2,500/-**

---

**2. నారు నాటడం :**

మిరప నారును మడుల నుండి పీకి, పొలానికి చేర్చాలి. అందుకు మనుషులు నారు మోసుకుని వెళ్ళాలి లేదా ఎద్దుల బండి అవసరం. అక్కడ కూలీలు పొలంలో నారు నాటుకుంటూ వెళ్తారు. వారికి ఒకరు లేదా ఇద్దరు కూలీల సంఖ్యను బట్టి నారు అందించే సహాయ కూలీలు అవసరం. నారు నాటేవారు ప్రతి మొక్కను వంగి పొలంలో నాటడం వల్ల ఎక్కువగా అలసి పోతారు, నడుము నొప్పి ఎక్కువగా వస్తుంది. ఈమధ్య మిరప నారు వర్షం ఒకటి రెండు రోజుల్లో వచ్చే సూచన కనిపించి నప్పుడు పట్టి పొలంలో నీరు పోసి, నారు నాటుతూ ఉంటారు.

■ పొలంలో నీరు పోయటానికి ఎకరాకు 6 మంది కూలీలు అవసరం ఒక్కొక్కరి కూలీ రూ. 700/- ప్రకారం మొత్తం 5 ఎకరాలకు కూలీల ఖర్చు : 21,000/-
■ నారు నాటడానికి ఎకరాకు 5 మంది కూలీలు, వారికి నారు అందించటానికి 2 కూలీలు అవసరం ఒక్కొక్కరి కూలి రూ. 350/-. 5 ఎకరాలకు : 12,250/-
**■ మొత్తం ఖర్చు 5 ఎకరాలకు : 33,250/-**

మిరప నారును పొలానికి చేర్చడానికి వీడర్‌కు అనుసంధానం చేయబడ్డ ట్రాలీ ద్వారా పని చేసుకోవచ్చు. నారు నాటేవారు ప్రతి మొక్కను వంగి పొలంలో నాట వలసిన అవసరం లేకుండా నిలబడే నాటడానికి అనువు గా 'క్విక్ ప్లాంటర్' అనే ఇన్నోవే షన్‌ను ఉపయోగించి 5 మంది చేసే పని ముగ్గురు చేయవచ్చు.

■ పొలంలో నీరు పోయటానికి కూలీల అవసరం లేకుండా, వీడర్‌కు ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకుని, ఒకే వ్యక్తి కూలీలకు అవసరమైన నీటిని అందించ వచ్చు. అందుకు వీడర్ కిరాయి : 5000/-
■ నారు నాటడానికి ఎకరాకు 3 మంది కూలీలు, ఒక్కొక్కరి కూలి రూ. 350/- ప్రకారం 5 ఎకరాల కూలీల ఖర్చు : 5250/-
**■ మొత్తం ఖర్చు 5 ఎకరాలకు : 10,250/-**

---

**3. ఎరువులు వేయటం**

మిరపలో ఎరువులు వేయాలంటే అందుకు అవసర మయ్యేది కేవలం ఎద్దుల జత మాత్రమే. ట్రాక్టరుతో వెయ్యటం కుదరదు. ఒకరోజు ఎద్దుల జత కిరాయి కనీసం రూ. 1,500/-. ఎరువు వేసే మనిషి కూలీ రూ. 500/-. ఆ కూలీకి ఎరువు అందించేందుకు మరో మనిషి కావాలి.

■ ఎరువులు వెయ్యటానికి ఎద్దుల జత కిరాయి : 1,500/-
■ ఎరువు వేసే కూలీ ఖర్చు : 700/-
■ సహాయకారి కూలీ : 350/-
**■ మొత్తం : 2,550/-**
ఇలా రైతు పంటకు ఎరువును 5 సార్లు వేస్తాడు.
**5 పర్యాయాలు ఎరువులు వేసేందుకు ఖర్చు : 12,750/-**
**5 ఎకరాలకు ఎరువులు వేసే ఖర్చు : 63,750/-**

వీడర్ ద్వారా కేవలం ఒకే వ్యక్తి రోజుకు కనీ సం 5 ఎకరాల వరకు ఎరువులు వెయ్యవచ్చు.
ఈ వీడర్ కిరాయి(ఎరువు వేసే మనిషి అవసరం లేదు) : 1,500/-
ఎరువు అందించే సహాయకారి కూలీ : 350/-
**మొత్తం : 1,850/-**
ఇలా రైతు పంటకు ఎరువును 5 సార్లు వేస్తాడు.
**5 పర్యాయాలకు ఖర్చు : 9,250/-**
**5 ఎకరాలకు ఎరువులు వేసే ఖర్చు : 46,250/-**

---

**4. పురుగు మందుల పిచికారి**

పురుగు మందు పిచికారి చెయ్యాలంటే, (స్ప్రేయర్ + స్ప్రే చేసే మనిషి, పురుగు మందు కలిపి స్ప్రే చేసే వ్యక్తికి అందించేందుకు సహాయకారి, నీళ్ళు తీసుకు వచ్చేందుకు ఒక వ్యక్తి అవసరం.

■ స్ప్రే చేసే వ్యక్తి కూలి + స్ప్రేయర్ కిరాయి : 2,000/-
■ పురుగు మందు అందించే వ్యక్తి కూలీ : 350/-
■ నీళ్ళు తీసుకు వచ్చే ఒక వ్యక్తి కూలీ : 700/-
■ మొత్తం 5 ఎకరాలకు అయ్యే ఖర్చు : **3,050/-**
**ఇలా రైతు మొత్తం 5 ఎకరాలకు మిరప పంట కాలంలో కనీసం 15 సార్లు పిచికారి చేస్తాడు. అందుకు ఖర్చు : 45,750/-**

అదే పురుగు మందు పిచికారి ఈ వీడ ర్‌తో చేసినట్లయితే, నీళ్ళు తోడుకునే మనిషి అవసరం లేదు, కేవలం వీడర్ డ్రైవర్, ఒకరు మందు కలిపేందుకు సహాయ కూలీ చాలు.
ఈ వీడర్ కిరాయి (స్ప్రే చేసే మనిషి అవసరం లేదు) : 1,500/-
పురగు మందు అందించే కూలి : 350/-
**మొత్తం : 1,850/-**
**5 ఎకరాలకు 15 పర్యాయాలు పురుగు మందుకు ఖర్చు : 27,750/-**

---

**5. అంతర సేద్యాలు**

మిరప పంటలో అంతర సేద్యాలు తప్పనిసరి. ఈ పని మొత్తం పంటలో కనీసం 4 పర్యాయాలు, 2 పర్యాయాలు గొర్రుతో కూడా అంతర సేద్యం చేయవలసి ఉంటుంది.

| | | | | |
|---|---|---|---|---|
| | ఇలా చేయటం వల్ల సాళ్ల మధ్యలో కలుపు నివారణతో పాటు మట్టిని తిరగ తోడటం వల్ల పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది. ■ **ఒక కాడి ఎద్దుల కిరాయి రూ. 1,500/- ప్రకారం మొత్తం 6 కాడిల ఖర్చు మొత్తం 5 ఎకరాలకు :** | **9,000/-** | **వీడర్ ద్వారా అంతర సేద్యాల ఖర్చు రూ. 1,000/- ప్రకారం 6 సాళ్లకు 5 ఎకరాలకు :** | **6,000/-** |
| **6. కలుపు తీయటం** | కలుపు తీయాలంటే కనీసం ఎకరాకు 10 మంది కూలీలు అవసరం. ఇలా పంట మొత్తంలో కనీసం 4 పర్యాయాలు కలుపు తీయాల్సి ఉంటుంది. 5 ఎకరాల పంటలో కలుపు తీయాలంటే 50 మంది కూలీలు అవసరం. ■ ఒక్కో కూలీ ఖర్చు రూ. 350/- ప్రకారం 50 మంది కూలీ : | 15,500/- | పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన 'కుర్పీ' పరికరం ద్వారా 10 మంది తీసే కలుపును కేవలం ఇద్దరు వ్యక్తులు తీయవచ్చు. ■ 5 ఎకరాలలో కలుపు తీసేందుకు 10 మంది కూలీల ఖర్చు : | 3,500/- |
| | ■ **మొత్తం 4 పర్యాయాలు కలుపు తీసేందుకు 5 ఎకరాలకు అయ్యే ఖర్చు :** | **62,000/-** | ■ **మొత్తం 4 పర్యాయాలు కలుపు తీసేందుకు మొత్తం 5 ఎకరాలకు అయ్యే కలుపు ఖర్చు :** | **14,000/-** |
| **7. పంట నూర్పిడి తర్వాత** | మిరప పంట తెంపేటపుడు ఆ కాయలను పొలంలో ఒక చోటకు చేర్చటానికి, అక్కడి నుండి ఇంటికి లేదా మార్కెట్‌కు తరలించడానికి లేదా మిరప పండు ఆరబెట్టడం కోసం కళ్ళం లేదా బయలు స్థలంలోకి చేర్చటానికి, మిరప పండు ఆరిన తర్వాత వాటిని మార్కెట్‌కు లేదా ఇల్లు/ గోడౌన్‌కు తరలించడం ■ **ఈ ఖర్చులన్నీ కలుపు కుంటే 5 ఎకరాల పంటకు కనీసం ఖర్చు సుమారుగా :** | **10,000/-** | ఈ పనులన్నీ వీడర్‌ను అనుసంధానం చేసిన ట్రాలీ ద్వారా చేసుకోవచ్చు. ■ **మనిషితో సహా ట్రాలీ కిరాయి :** | **5,000/-** |
| | **మొత్తంగా మిరప పంటలో 5 ఎకరాల రైతుకు అయ్యే మొత్తం ఖర్చు :** | **2,30,250/-** | **'పల్లెసృజన' పద్ధతి ఉపయోగించటం ద్వారా మొత్తంగా మిరప పంటలో 5 ఎకరాల రైతుకు అయ్యే మొత్తం ఖర్చు :** | **1,11,750/-** |
| | **ఒక ఎకరానికి ఖర్చు:** | **46,050/-** | **ఎకరానికి ఖర్చు :** | **23,250/-** |
| | **ఒక గ్రామంలో 10 మంది రైతులకు అంటే 50 ఎకరాలకు అయ్యే ఖర్చు :** | **23,02,500/-** | **ఒక గ్రామంలో 10 మంది రైతులకు అంటే 50 ఎకరాలకు అయ్యే ఖర్చు :** | **11,17,500/-** |

| | | | |
|---|---|---|---|
| **8.కొనుగోలు** | పరికరాల కొనుగోలు / పెట్టుబడి | **ఖర్చు** | **సంక్షిప్త సారాంశం :** |
| | ■ వీడర్ (పరికరాలతో కలిపి) : | 3,00,000/- | ● 50 ఎకరాల ప్రస్తుత పద్ధతిలో అయ్యే ఖర్చు : **23,02,500/-** |
| | ● బెడ్ మేకర్ (బోదెలు చేసే పరికరం) | | **ఒక ఎకరానికి ఖర్చు : ....** |
| | ● ఎరువు/ విత్తనం వేసే జడిగం : | | ● 50 ఎ. 'పల్లెసృజన' కిట్‌తో అయ్యే ఖర్చు : **11,17,500/-** |
| | ● పురుగు మందు పిచికారి చేసే స్ప్రేయర్ : | | ● 50 ఎ. రైతులకు మిగిలిన ఖర్చు : **11,85,000/-** |
| | ● వాటర్ ట్యాంక్ : | | ● పెట్టుబడి / పరికరాల కొనుగోలు : **3,80,000/-** |
| | ● ట్రాలీ : | | ● నికర ఆదాయం (మొదటి పంటలో) : **16,100/-** |
| | ■ క్విక్ ప్లాంటర్ (10) : | 30,000/- | ☛ **ఎకరానికి ప్రస్తుత పద్ధతిలో ఖర్చు : 46,050/-** |
| | ■ కుర్పి (10 సెట్లు (ఒక్కో సెట్‌లో 5) : | 35,000/- | ☛ **ఎకరానికి 'పల్లెసృజన' కిట్ ఖర్చు : 22,350/-** |
| | ■ బ్రష్ వీడర్లు (30) : | 15,000/- | ☛ **ఎకరానికి 'పల్లెసృజన' రైతుకు మిగిలేది : 23,700/-** |
| | ■ **మొత్తం పరికరాలు, వీడర్‌ల ఖరీదు :** | **3,80,000/-** | |

**ఈ కిట్టుని 50 ఎకరాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కనీసం 5 సంవత్సరాలు వినియోగించుకోవచ్చని రైతులు అభిప్రాయ పడ్డారు.**
**ఎకరానికి పరికరాల కొనుగోలు ఖర్చు : 7,600/-. అది కూడా మొదటి సంవత్సరంలోనే తీరిపోతుంది. అంటే మిగతా 4 సంవత్సరాలు ఎకరాకు 23 వేల ఖర్చు మిగులే.**

పల్లెసృజన మిరప పంటకై ప్రతిపాదించిన 'పల్లెసృజన మిరప కిట్' వల్ల రైతులకు దాదాపు 30% ఖర్చు తగ్గుతుంది. పాఠకులు, రైతులు పల్లెసృజన పైన ప్రతిపాదించిన ప్రయోగాన్ని చదివి, మీ అభిప్రాయాలు, సవరణలు, సూచనలు తప్పక పంపండి.

ఇలాగే తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా పండించే 10 పంటలకు 'పల్లెసృజన కిట్'లను తయారు చేయటం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మీరూ భాగస్వాములు కావాలనుకుంటే సంప్రదించండి. **పల్లె వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904.**

రైతులు లాభాలు రావాలంటే ఎక్కువ దిగుబడి, ఎక్కువ ధర అత్యవసరమన్న అభిప్రాయాన్ని ప్రక్కన పెట్టి రైతు పెట్టుబడి ఖర్చును తగ్గించే విధానాలను ప్రోత్సహిద్దామన్న పల్లెసృజన ఉద్దేశ్యానికి మీ తోడు కావాలని, రైతులు పల్లెసృజన కిట్‌లను వాడి లాభాలు పొందాలని, మార్కెట్ ధరలపై ఆధార పడకుండా, పెద్దపెద్ద మిషన్‌లపై ఖర్చు పెట్టకుండా రైతుల కొరకు రైతులు చేసిన ఇన్నోవేషన్లను ఉపయోగించుకుని, వ్యవసాయాన్ని సునాయాసంగా సాగించాలన్న తాపత్రయమే ఈ ప్రయత్నానికి మూలం.

# ఎన్.ఐ.ఎఫ్. వారి ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ (ఫైన్ - 2023) పురస్కారాలు




స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

ఎన్.ఐ.ఎఫ్. వారి జాతీయ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో విజేతలకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 10 నుండి 13, 2023 వరకు రాష్ట్రపతి భవన్ లోనే జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్ - 2023)" ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అందులో బహుమతులు పొందిన అనేక మంది ఇన్నోవేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన కొందరి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

## బంగారు రంగు ఎంబోజింగ్ చేసే యంత్రం

జాతీయ 2వ బహుమతి

**రవీంద్ర గన్‌పత్ చోపడే** (46)

ముంబై, మహారాష్ట్ర




ప్రింటింగ్ ముద్రలు చాలానే ఉండొచ్చు కానీ ముంబైకి చెందిన రవీంద్ర గన్‌పత్ చోపడే కంప్యూటర్ పైన మనం ప్రింట్ చెయ్యదలచుకున్న వాటిని 'ప్రింట్' అనే బటన్ నొక్కగానే నేరుగా ప్రింట్ అయిపోతాయి. అదేం గొప్ప అనకండి. ఈ ప్రింటరు రెక్సిన్, తోలు, ప్లాస్టిక్, కాగితం, బట్టలు లాంటి అనేక పదార్థాలపై ప్రింట్ చెయ్యగలదు. సంక్లిష్టమైన పద్ధతి గల ఈ ప్రింటరును ఆయన ఆరు సంవత్సరాల క్రితమే తయారు చేశాడు. దీనిలో 6 "అక్షాలు" ఉంటాయి. ఈ ఆరు వేరువేరు మోటర్‌ల సహాయంతో పని చేస్తాయి. ఈ యంత్రంలో ప్రథమంగా 3 ముఖ్య భాగాలుంటాయి. ఒకటి బంగారు రాగి ఇంకా ఫాయిల్ చుట్ట, క్రింది కదిలే బెడ్డు, అన్నింటికన్నా ముఖ్యంగా అక్షరాల చక్రం. ఈ చక్రాన్ని ఆయన చాలా కష్టపడి స్వంతంగా తయారు చేసుకున్నాడు. "సి" ప్రోగ్రాం తెలిసిన స్నేహితుడు నాకు ఈ చక్ర తయారు చెయ్యటంలో సహాయం చేశాడని అంటాడీయన. ఒకటేదాన్ని కేవలం 3 నిమిషాల్లో ప్రింట్ చెయ్యవచ్చు అంటాడు.

తనకు నచ్చే విధంగా ఈ ప్రింటర్‌ని తయారు చెయ్యటానికి ఆయనకి 6 సంవత్సరాలు పట్టింది. ఇది భారతదేశంలోనే మొట్టమొదటి ఇటువంటి ప్రింటర్ అని చెప్పాడాయన. ఖర్చులు కూడా చాలా తక్కువగానే ఉంటాయి. ఒక డాక్యుమెంట్ ప్రింట్ చెయ్యటానికి కేవలం 50/- రూపాయలు ఖర్చు అవుతుందట. దీనిలో బట్టలమీద, రెక్సిన్, చర్మం, ప్లాస్టిక్ మొదలైన ఎన్నో రకాల వస్తువులపై నేరుగా ప్రింట్ చేసుకోవచ్చు. ఇక్కడ ప్రింట్ అంటే ఎంబోజింగ్ అని చెప్పుకోవాలి.

మొత్తం యంత్ర ఖరీదు రూ. 5.5 లక్షల రూపాయలు అవుతుంది. త్వరగా కొన్న వారికి 2000 రెక్సిన్ కవర్లు ఉచితంగా ఇస్తాడట.

ఈయన తండ్రి ఐఐటి, బొంబాయి లో సెక్యూరిటీ గార్డుగా పని చేశారు. కనుక రవీంద్ర చిన్నతనం మొత్తం ఐఐటి క్యాంపస్‌లోనే గడిచిపోయింది. అక్కడే ఇతను ఒక ఫోటో కాపీయింగ్ షాపు తెరిచాడు. దానిలో పని చేస్తూ ఆదాయం గడిస్తూ తన సృజనాత్మకతకి వర్క్‌షాప్‌గా ఎన్నుకున్నాడు. ఈయన మొదట బంగారు రంగు అక్షరాలు ప్రింట్ చేసే చిన్న యంత్రాన్ని డాట్‌మేట్రిక్స్ ప్రింటర్ ఆధారంగా తయారు చేశాడు. తర్వాత ఇంక్‌జెట్, లేజర్ ప్రింటర్‌ల ఆధారంగా కూడా తయారు





చేశాడు.

రవీంద్ర 2015లో ఐ–ఎంబోస్ ప్రైవేట్ లిమిటెడ్ ని స్థాపించటానికి ఐఐటిలో పని చేసే కొందరు మిత్రులు సహాయం చేశారు. ప్రస్తుతం ఆ కంపెనీలో ఇతను డైరెక్టర్. తమ కంపెనీకి ఒక వెబ్‌సైట్ తయారు చేస్తున్నారు. అది తయారైతే తన ప్రింటర్ గురించి విస్తృతంగా నలుగు రికీ తెలిసే అవకాశం ఉంటుంది అంటాడాయన. రవీంద్ర తన ఈ ప్రింటర్‌ని ఇంకా చవకగా తయారు చెయ్యాలనుకుంటున్నాడు. దీనికి ఉత్సాహవంతులైన యువత ముందుకు వచ్చి శిక్షణ ఇచ్చి ఉదారంగా ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నాడు. క్రమంగా పెళ్ళి పత్రికలు, సర్టిఫికెట్లు, గ్రీటింగ్ కార్డులు కూడా ప్రింట్ చేసే విధంగా తన యంత్రాన్ని రూపుదిద్దతాననీ, ఇంకా తన యంత్రం నిర్మాణ దశలోనే ఉందన్నాడు ఈయన.

భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ రకం గోల్డన్ ఎంబోజింగ్ యంత్రాన్ని తయారు చేసినందుకు గాను రవీంద్ర గన్‌పత్ చోపడే కి ఎన్ఐఎఫ్ వారు తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023 సంవత్సరంలో జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు.

## చేతితో లాగే వరి నాటే యంత్రం

జాతీయ 2వ బహుమతి

**సదాసిబో యాజీ**(43)

కోరపుట్, ఒడిస్సా



వరి వ్యవసాయం చేసే వారికి నారుమడి నుంచి పొలంలో నారు నాటడం ఎంత కష్టమైన పనో బాగా తెలుసు. వరి నాటుని సులువు చేసే పద్ధతులు ఎన్నో వచ్చినా సంతృప్తిగా పని చేసేది లేదని అనిపిస్తుంది. అటువంటి రైతులకి చాలా సంతృప్తికరంగా పని చేసే ఒక వరి నాటే యంత్రాన్ని ఒడిస్సా రాష్ట్రంలోని కోరపుట్ ప్రాంతానికి చెందిన 43 సంవత్సరాల సదాసింబో యాజీ రూపొందించారు. ఈ ప్లాంటర్ వాడటం వలన నారుమడి నుంచి పొలంలోకి వరి నాటడం చాలా సులువు అవుతుంది. ఈ యంత్రంలో నాలుగు స్ప్రెర్‌ల కన్వేయర్‌లు నారును నాలుగు జతల రబ్బరు రోలర్ పైకి తీసుకొని వెళతాయి. అక్కడ కొసగా ఉన్న లోహపు పిన్సర్స్ వీటిని తీసుకుని భూమిలోకి గుచ్చి అక్కడ వరి నారుని విడిచిపెడతాయి. ఈ యంత్రం సహాయంతో తమకు కావలసిన దూరంలో వరిని నాటే సదుపాయం ఉంది. ఈ యంత్రానికి వున్న రెండు చక్రాలు చైను స్ప్రాకెట్‌ల సహాయంతో ఒక గంటలో నీటితో నిండిన పొలంలో కూడా ముందుకు సులువుగా వెళ్ళటానికి సహాయ పడతాయి. దీని సహాయంతో గంటకి 0.16 హెక్టార్లలో వరి నాటవచ్చు. దీనిని లాగటానికి ఇద్దరు వ్యక్తులు అవసరం అవుతారు.

ఈ యంత్రంలో ఒకే సీల్డ్ గేర్ బాక్స్ ఉండటం వలన ప్రతిదీ సూక్ష్మంగా కొలుచుకొని నిర్ణయించాల్సి వచ్చిందంటాడు సదాసిబో యాజీ. చాలాసార్లు చేసుకుని దిద్దుకొని అయిన తరువాత దీనికి తుది మెరుపు ఇచ్చాను అంటాడాయన. ఈ యంత్రం కనిపెట్టాలని ఎందుకు అనిపించింది అని అడిగితే ఆయన "నాకు స్వంతంగా చదువు లేదు నేను రైతు మిత్రులతో టీ తాగుతూ మాట్లాడుకునేటప్పుడు వాళ్ళు పడే బాధలు విని వారికి సహాయం చెయ్యాలని అనిపించి ఇది రూపొందించాను" అంటారు. సరైన సదుపాయం ముఖ్యంగా కూలీలు లేక, వాళ్ళ ఖర్చులు భరించలేక మారు నాటడం ఆలస్యం అవ్వటము, దానివల్ల దిగుబడి తగ్గడం జరిగేదట. అది విని నేను ఈ పని చేసినందుకు మూడు అడుగుల వెడల్పు ఉండే ఈ యంత్రం లాగటానికి ఇద్దరు వ్యక్తులు కావాలి. ముందుగా కన్వేయర్ పైన వరి నారు పద్ధతిగా పేర్చుకొన్న తరువాత దీన్ని లాగుతూ పోతే వరి నాటుకుంటూ వెళుతుంది అంటాడాయన. ప్రస్తుతం ఈ యంత్రం ధర రూ. 35,000/–. కానీ దీనిని ఇంకా ప్రజలకి (రైతులకి) అందుబాటులోకి తేవాలని అంటాడాయన. దీనికి ఎన్ఐఎఫ్ వారు సహాయం చేస్తే యంత్రం ఖర్చుని రూ. 24 – 25 వేలకే అందజేయవచ్చుని అంటాడు.

వరి సేద్యంలో నారుమడి నుంచి పొలంలోకి నారు నాటడానికి సహాయపడే చవకైన యంత్రం అందించి, రైతులకి ఎంతో సమయం, ఖర్చు కలిసి వచ్చేలా తయారు చేసినందుకు గాను సదాసిబా మాజీ కి ఎన్ఐఎఫ్ వారు తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ల మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## 'వర్షాకాలం' లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు - వైద్యం



ఉమా మహేశ్వర రావు

'వర్షాకాలం' వస్తుంది అనగానే ముందుగా భయపడేవారు 'ఆస్తమా' వ్యాధిగ్రస్తులు. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఊపిరి తిత్తుల్లో సమస్యలు ఏర్పడి ఊపిరి ఆడక సతమతం అవుతూ ఉంటారు. అందుకే ఆ వ్యాధి గ్రస్తులు వర్షాకాలం వచ్చిందంటే చాలు ముందస్తు జాగ్రత్త కోసం ఎన్నో రకాల మందులు, గుళికలు వేసుకుంటూ ఉంటారు. వాటివల్ల కొంత వరకు ఉపశమనం కలిగినా, ఆ మందులు వేసుకోవటం వల్ల ఎన్నో రకాల సైడ్ ఎఫెక్ట్‌ల వల్ల కిడ్నీలు, గుండె కు సంబంధించి మరి కొన్ని రకాల అదనపు ఇబ్బందులు ఎదురవుతూ ఉంటాయి. అందునా ఈ కాలం ఇళ్ళల్లో దోమల బెడద కూడా కొద్దిగా ఎక్కువే. కాబట్టి ఇళ్ళు శుభ్రంగా ఉంచేందుకు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. పాత్రలలో, బకెట్లలో నీరు ఎల్లప్పుడూ నిలువ ఉంచకుండా వాటిని శుభ్రంగా ఉంచుకోవడం. మూలల్లో బూజు పట్టకుండా, ఎక్కువగా దుమ్ము ధూళి లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం మంచిది. ఎందుకంటే ఈ బూజు, దుమ్ము ధూళి వల్ల ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఎక్కువగా తుమ్ములు, జలుబు, దగ్గు వచ్చే అవకాశం ఉంటుంది.

కొందరు ఇంట్లో మొక్కలను పెంచుకుంటూ ఉంటారు. అటువంటి వారు కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలి. కొన్ని మొక్కలు పూలు పూయటం వల్ల వాటి పుప్పొడి గదిలో వ్యాపించడం, పూల కుండీలలో నీరు నిలువ ఉన్నట్లయితే వాటిలో దోమలు గుడ్లు పెట్టుకునే అవకాశం లేకుండా చూసుకోవాలి. ఇంట్లో బీడీ, చుట్ట, సిగరెట్ లాంటివి కాల్చకుండా చూసుకోవాలి. సమీపంలోని కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యమైన గాలి, పొగ లాంటివి ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే ఇవన్నీ ఆస్తమా రోజులకు ప్రతికూలమైనవి. ఇళ్ళు శుభ్రం చేయటానికి ఉపయోగించే యాసిడ్లు, ఇంటిని శుభ్రం చేసేందుకు ఉపయోగించే రసాయనాలను తగ్గించుకోవాలి. ప్రస్తుతం మార్కెట్‌లో రసాయన రహిత శుభ్రం చేసే ద్రవాలు లభిస్తున్నాయి. ఉదాహరణకు కుంకుడు కాయలతో చేసిన ద్రవాలు లాంటివి ఉపయోగించటం మంచిది. ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఈ వర్షాకాలంలో ముఖానికి మాస్క్ ధరించుకోవడం ఉత్తమం.

ఆస్తమా వ్యాధి గ్రస్తులు ఇంట్లోనే తయారు చేసుకుని ఉపశమనం పొందే వైద్యాలు కొన్ని ఉన్నాయి. వాటిని పాటిస్తే చాలా వరకు ఆస్తమా వ్యాధికి దూరంగా ఆరోగ్యంగా మనగలుగుతారు. 3-4 మిరియాల గింజలను తీసుకుని పొయ్యిమీద కాస్త వేడి చేసినట్లయితే వాటిలోని అనవసర పదార్థాలు కొన్ని పొగ రూపంలో బయటకు వెళ్తాయి. ఆ తర్వాత ఆ మిరియపు గింజలను ఏదైనా ఆహారంతో పాటు కలిపి తీసుకుంటే మంచిది. తుమ్ములు, దగ్గు, ఆయాసం, జలుబు ఉన్నవాళ్ళు దాల్చిన చెక్క – 100 గ్రాములు, యాలక్కాయలు 30-50 గ్రా., జాజి కాయలు – 2, అతిమధురం– 100 గ్రా., అడ్డసరం– 100 గ్రా., తీసుకుని వాటిని రోట్లో వేసి మెత్తగా నూరి పొడిగా చేసుకుని ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ఆ తర్వాత ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఒక టీస్పూను పొడిని గోరువెచ్చటి నీటిలో కలిపి త్రాగాలి. చిన్న పిల్లలకయితే రెండు చిటికల పొడిని తేనెతో కలిపి నాకించాలి. 5 సంవత్సరముల వయసు దాటిన పిల్లలకు అర చెంచాడు పొడిని తేనె లేదా నెయ్యిలో కలిపి నాకించినట్లయితే ఆస్తమా వ్యాధి నుండి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు.

ఈ వర్షాకాలంలో గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల జ్వరం వచ్చినచో త్వరగా తగ్గదు. అందుకు కారణం శరీరంలో జఠర రసం రక్తంలో కలిసి పోయి జ్వరం తగ్గకుండా చేస్తుంది. అటువంటి వారు ధనియాలు, జీలకర్ర, వాము లను సమాన మోతాదులో తీసుకుని, పెనంపైన వేసి కొద్దిగా వేడి చేసి, వాటిని మెత్తటి పొడి చేసి ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఆ తర్వాత ప్రతి రోజూ ఒక స్పూను పొడిని ఒక గ్లాసు నీటిలో వేసుకుని, ఆ నీరు సగం అయ్యే వరకు కాచి, కషాయం తయారు చేసుకుని ప్రతిరోజూ తీసుకోవాలి. ఇలా చేసినట్లయితే రక్తంలో కలిసి పోయిన జఠర రసాన్ని నిర్వీర్యం చేసి, త్వరగా జ్వరం తగ్గేలా చేస్తుందీ కషాయం. ఆస్తమా ఉన్న వ్యక్తులు వీలైనంత వరకు రాత్రి పూట భోజనం మానేసి, తేలిగ్గా అరిగే ఇడ్లీ లాంటి పదార్థాలను తీసుకుంటే మంచిది.

ఆస్తమా వ్యాధిని తగ్గించుకోవటం కోసం ఎన్నో రకాల మాత్రలు వేసుకోవటం వల్ల వాటినుండి సైడ్ ఎఫెక్ట్‌లు రావటం, వాటిని తగ్గించుకోవటం కోసం యాంటీ బయాటిక్స్‌ను వాడటం వల్ల మళ్ళీ కొన్ని సైడ్ ఎఫెక్ట్‌లు వచ్చి వ్యక్తి అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. కావున ఈ సమస్యలన్నిటి నుండి విముక్తి కలగాలంటే మాత్రలు వేసుకోవటం కన్నా పైన చెప్పిన వంటింటి చిట్కాలు ఆచరించినట్లయితే అనాయాసంగా ఆయాసాన్ని, ఆస్తమాను నియంత్రణలో ఉంచుకోవచ్చు.

ప్రస్తుతం 'డెంగ్యూ జ్వరాలు' కూడా తీవ్రంగా విజృంభిస్తూ ఉన్నాయి. ఈ డెంగ్యూ జ్వరం బారిన పడినవారు 'అతిమధురం, అడ్డసరం, తిప్పతీగ పొడి' – ఇవన్నీ ఆయుర్వేద దుకాణాల్లో లభిస్తాయి. వాటి ఒక్కోటి 100 గ్రా. చొప్పున తెచ్చుకుని, అందులో 100 గ్రా. ధనియాలు, 100 గ్రాముల మిరియాలు కూడా పొడి చేసుకుని అందులో కలిపి ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ఇంట్లో ఎవరికి జ్వరం వచ్చినా సరే ప్రతిరోజూ ఉదయం ఒక చెంచా, సాయంత్రం ఒక చెంచాడు పొడిని గ్లాసు నీటిలో వేసి ఆ నీరు సగం అయ్యే వరకు కాచి, ఆ కషాయాన్ని తీసుకున్నట్లయితే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరస్ అనే నాలుగు రకాల జ్వరాలు అన్నీ కూడా ఈ కషాయంతోనే నియంత్రించ బడతాయి. చిన్న పిల్లలకైతే అర చెంచాడు పొడి, మరీ చిన్న పిల్లలకైతే రెండు మూడు చిటికలు వేసి కషాయం చేసి తాపితే చాలు.

మాత్రలు వేసుకోకుండా వీటిని మాత్రమే ఆచరించండి అని చెప్పటం లేదు. మీరు వేసుకునే మాత్రలతో పాటు ఈ పద్ధతులను కూడా పాటించినట్లయితే మీరు వేసుకునే మాత్రల వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్‌లు రాకుండా నివారించుకుని ఆరోగ్యంగా వర్షాకాలం గడిపేయవచ్చు. మాత్రలు వేసుకోకుండా ఈ చిట్కాలను పాటించినా మంచి ఫలితాలను మీరు గమనించవచ్చు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# వర్షాకాలానికి ఆరోగ్య చిట్కాలు

**ఆస్తమా వ్యాధిగ్రస్తులు:**

ప్రస్తుతం వర్షాకాలం లో ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాల్సింది 'ఆస్తమా' వ్యాధిగ్రస్తులు. ఈ వ్యాధి ఉన్న వారు ఉబ్బసం, ఆయాసంతో ఊపిరి సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఉంటారు. అటువంటి వారు ఈ సమస్యల నుండి ఉపశమనం పొందటా నికి బాగా పండి, చెట్టుమీదనే ఎండిపోయినట్లు ఉన్న 'జిల్లేడు' ఆకులను సేకరించాలి. ఆకు బాగా ఎండిన తర్వాత దానిని చేతితో నలిపి పొడిగా చేసి, మరో ఎండిన జిల్లేడు ఆకును చుట్టలాగా చేసుకుని అందులో పొడి వేసి, చుట్ట కాల్చినట్లు కాల్చినట్లయితే ఉబ్బసం, ఆయాసం నుండి ఉపశమనం పొందవచ్చు. కానీ, ఇది కొందరు ముఖ్యంగా బీడీ, సిగరెట్ అలవాటు ఉన్నవాళ్ళు మాత్రమే చెయ్యగలరు. పండు జిల్లేడు ఆకు లభించనిచో 'నల్ల ఉమ్మెత్త' ఆకుతో ఇలా చేసినా కూడా మంచి ఫలితం ఉంటుంది. అయితే వీటిని బీడీ, సిగరెట్, చుట్ట లాగా తాగాల్సిన అవసరం లేదు. వాటిని నిప్పుతో అంటించి పెదాలపై పెట్టుకొని కేవలం పొగను నోట్లోకి పీల్చుకుని, బయటకు వదిలితే చాలు. జలుబు చేసినప్పుడు పసుపు నీటితో ఆవిరి పట్టినట్లు ఆ పొగను పీల్చడం, వదిలేయటం చేస్తే చాలు.

**చర్మ వ్యాధులు:**

వర్షా కాలంలో కొందరికి చర్మ వ్యాధులు వస్తూ ఉంటాయి. ఆ వ్యాధుల ప్రభావం వల్ల చర్మంపై దురదలు, బెందులు ఏర్పడుతుంటాయి. అటువంటి వారు కొద్దిగా వాము తీసుకుని నిప్పు కణికలపైన వామును వేసినట్లయితే పొగ వస్తుంటుంది. ఆ పొగను చర్మవాధి ఉన్నచోట శరీరానికి తగిలేలా చేసినట్లయితే చర్మవ్యాధులు చాలా వరకు నయమౌతాయి.

**చెంప వాపులు:**

ఈ కాలంలోనే కొందరికి చెవి క్రింది భాగంలో చెంపలు వాపులు వస్తూ ఉంటాయి. దీని ప్రభావం వల్ల వారికి తినటానికి ఇబ్బందిగా ఉంటుంది, జ్వరం తీవ్రంగా వస్తూ ఉంటుంది, గవద (దవడ) లనొప్పులతో బాధపడుతూ ఉంటారు. పూర్వం ఈ వ్యాధి వచ్చిన వారికి రాగి కడ్డీతో కాల్చి వాతలు పెట్టి వైద్యం చేస్తూ ఉంటేవారు. అటువంటి వారికి మునగ చెట్టు బెరడు, ఆవాలు సమానంగా తీసుకుని రెండింటినీ కలిపి రోట్లో వేసి అప్పుడప్పుడూ కొద్దిగా చేతితో నీటి తడి చేరుస్తూ మెత్తగా నూరినట్లయితే అది పేస్టులాగా తయారవుతుంది. ఆ పేస్టును వాపులు ఉన్న చెంపలపై పూసినట్లయితే 3–4 రోజుల్లో చెంపల వాపులు తగ్గిపోతాయి.

**రక్తవృద్ధి, రక్తశుద్ధి కొరకు చిట్కా:**

దాదాపు ప్రతి పట్టణంలో దేశీ రకాలైన చిన్న అరటి పండ్లు లభిస్తూ ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో వీటిని 'సుగంధాలు' అని, మరికొన్ని ప్రాంతాల్లో 'చక్కెర కేళీ' అని పిలుస్తూ ఉంటారు. అలాంటి అరటి కాయలు సేకరించి వాటిని చిన్న చిన్న ముక్కలుగా తరిగి, ఆ ముక్కలను ఒక గిన్నెలో వేసుకుని, అందులో కొద్దిగా తేనె, కొద్దిగా నెయ్యి వేసుకుని తిన్నట్లయితే శరీరంలో రక్తం వృద్ధి చెందటంతో పాటు, రక్త శుద్ధి కూడా జరుగుతుంది.

**విరోచనాలు:**

వర్షాకాలం కొత్తనీరు రావటం వల్ల కొంతమందికి సహజంగా విరోచనాలు అవుతూ ఉంటాయి. అటువంటి వారికి బాగా మీగడ కట్టిన పెరుగులో మీగడను మాత్రమే తీసుకుని, అందులో తేనె కలుపుకుని తిన్నట్లయితే విరోచనాలు త్వరగా ఆగిపోతాయి. కొద్దిగా జిలేబి తిన్నా కూడా విరోచనాలు ఆగిపోతాయి. అలాగే దానిమ్మ చెట్టు బెరడు లేదా ఆకులు లేదా చిన్న చిన్న కాయలు తీసుకుని నోట్లో వేసుకుని తిన్నా కూడా విరోచనాలు ఆగిపోతాయి. పచ్చి అరటి కాయను కొరుక్కుని తిన్నా కూడా విరోచనాలు ఆగిపోతాయి.



'వైద్య' కొమెర జాజి

**పేల సమస్య:**

వర్షాకాలంలో కొందరికి పేల సమస్య కూడా తీవ్రం అవుతూ ఉంటుంది. అటువంటి వారు సీతాఫలం గింజలను తీసుకుని, వాటి పై పొట్టు వలిచి పప్పును మాత్రం తీసుకుని రోట్లో వేసి కొద్ది కొద్దిగా నీటి చుక్కలను వేస్తూ మెత్తగా నూరి తయారైన పేస్టును తలపైన పూసుకుని ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే తలలోని పేలన్నీ చనిపోయి, దువ్వెనతో దువ్వినప్పుడు అవి క్రిందకు పడిపోతాయి. ఈ చిట్కాను వర్షా కాలం మాత్రమే ఎప్పుడైనా సరే తలలో పేలు ఉన్నవారు ఉపయోగించి తలలోని పేలను నివారించుకోవచ్చు.

**పులిపిర్లకు వైద్యం:**

శరీరంలో కొందరికి చంకలలో పులిపిర్లు అవుతూ ఉంటాయి. కొందరికి శరీరంలో అక్కడక్కడా పులిపిర్లు అవుతూ ఉంటాయి. అటువంటి వారు 'కామంచి' ఆకును సేకరించి, మెత్తగా నూరి, అందులో కొద్దిగా సైంధవ లవణం (రాతి ఉప్పు) కలిపి ఆ ద్రావణాన్ని పులిపిర్లు ఉన్నచోట పూసినట్లయితే పులిపిర్లు రాలిపోతాయి.

**రణపాల ఆకుతో వైద్య చిట్కాలు:**

శరీరంలో వేడి గడ్డలు (వీటినే సెగ గడ్డలు, కంతులు అని కూడా అంటారు) అయినవారు రణపాల ఆకు వైద్యంతో వాటిని నివారించుకోవచ్చు. గడ్డలు అయిన చోట రణపాల ఆకును తీసుకుని దానికి ఆముదం బాగా పట్టించి పెనంపైన వేసి వేడి చేసిన తర్వాత ఆ ఆకును సెగ గడ్డ అయినచోట పెట్టి కట్టు కట్టినట్లయితే ఆ గడ్డ త్వరగా పాకానికి వచ్చి చీము బయటకు వచ్చి, నయమైపోతుంది. రణపాల ఆకును మెత్తగా నూరి, ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీరు సగం అయ్యే వరకు కాచి కషాయం చేసుకుని త్రాగినట్లయితే కిడ్నీలో రాళ్ళు ఉన్నవారికి అవి మూత్రం ద్వారా పడిపోతాయి. అలాగే గ్యాస్ ట్రబుల్ ఉన్నవాళ్ళకు కూడా ఈ కషాయం చాలా బాగా పని చేస్తుంది.

**తిప్పతీగతో వైద్యం:**

ఈ వర్షాకాలంలో తిప్పతీగ విరివిగా లభిస్తూ ఉంటుంది. పట్టణాలు పల్లెలు అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ తిప్పతీగ మొలిచి తీగలు పరుచుని ఉంటుంది. వాటి ఆకులు హృదయాకారంలో మెత్తగా ఉంటాయి. ఆ ఆకులను 7 తీసుకుని, ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీరు సగం అయ్యే వరకు కాగబెట్టి, చల్లారిన తర్వాత వడబోసుకుని, ఆకులను తీసివేసి ఆ నీటిని సేవించినట్లయితే మధుమేహం నియంత్రణలో ఉంటుంది, గ్యాస్ ట్రబుల్ తగ్గిపోతుంది, ఈ వర్షాకాలం లో వచ్చే అతిసారం వాంతులు, విరోచనాలను అరికడుతుంది. కడుపులో తిప్పినట్లు ఉన్నా అది కూడా నియంత్రించ బడుతుంది. వ్యాధి నిరోధక శక్తి బాగా పెరుగుతుంది. శరీరంలోని ఉడుకును కూడా తగ్గిస్తుంది. ●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

**వీరరాఘవ రెడ్డి గారు,**

'పల్లెసృజన' ద్వారా మీరు వెలుగులోకి తెస్తున్న రైతులకు అవసరమైన చిన్న మరియు పెద్ద పరికరాలు, పురుగు మందులు మార్కెట్‌లో లభించే వాటికన్నా కొద్దిగా ప్రత్యేకత కలిగి ఉన్న విషయం వాస్తవం. కానీ, మీరు ఊహిస్తున్నంతగా మార్కెటింగ్ కావటం లేదు అంటే రైతులకు చేరటం లేదు అని మీరు కొంత నిరుత్సాహంగా చెప్పటం విన్నాను. అందుకు కారణం నా దృష్టిలో ఒకటి ఉంది. మీరు కొత్త కొత్త ఇన్నోవేషన్‌లను వెలుగులోకి తెస్తున్నారు, వాటిని గురించి కథనాలు మన పల్లెసృజన పత్రికలో ముద్రిస్తున్నారు, వాట్స్ యాప్ ల ద్వారా తెలియజేస్తున్నారు. కేవలం వీటి ద్వారా మార్కెటింగ్ అవటం కుదరదు. ఎందుకంటే పత్రికలు చదివే వారిలో 50 శాతం పైగా సేద్యం చేస్తున్న రైతులు కాదు. ఇక వాట్స్ యాప్‌లు చూసే వారు రైతుల్లో చాలా తక్కువ మంది ఉంటారు. కాబట్టి మీరు వెలుగులోకి తెస్తున్న పరికరాలు మూలాలకు చేరటం లేదని నా అభిప్రాయం.

అందుకే మీరు మీ పరికరాలను, యంత్రాలను గ్రామాలలో విరివిగా ప్రదర్శన నిర్వహిస్తే ప్రతి రైతుకు చేరుకుంటుంది. అలాగే కొన్ని పెద్ద పెద్ద గ్రామాల్లో వారం వారం సంతలు జరుగుతుంటాయి. వాటిలో కొన్ని పెద్ద సంతలలో వ్యవసాయ పనిముట్ల అమ్మకాలు జరుగుతుంటాయి. అటువంటి సంతలలో మీ పరికరాలు నిత్యం అమ్మేలా ఒక స్టాల్ తప్పనిసరిగా ఏర్పాటు చేస్తే అవి తప్పకుండా రైతులను ఆకర్షిస్తాయి. కేవలం ఒక్కసారి సంతలో స్టాల్ ఏర్పాటు చేస్తే కుదరదు. మీరు అక్కడి స్థానిక వ్యక్తి ఒకరిని ఏర్పాటు చేసి, ప్రతి వారం ఒకే చోట ఈ పరికరాల ప్రదర్శన అమ్మకం జరిగేలా ఏర్పాటు చేస్తే రైతులు తప్పక కొనుగోలు చేసి వినియోగిస్తారు. ఎందుకంటే పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన పరికరాలు ఒక ప్రత్యేకత కలిగి ఉంటాయి, వాటి వల్ల శ్రమ, ఖర్చు కూడా తగ్గుతుంది కాబట్టి అవి అమ్ముడు పోవటం పెద్ద కష్టమేమీ కాదు, రైతుకు ఎంతో సేవ చేసిన వారు కూడా అవుతారు. ఈ సంతలలో స్టాళ్లు ఏర్పాటు చెయ్యటంతో పాటు, మీరు ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, నిత్యం గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉంటే తప్పక మీ పరికరాలు రైతుల మదిలో మంచి చోటు సంపాదించుకుని అందరు వినియోగించుకునే స్థాయికి చేరుతాయి అని నా నమ్మకం. **– ఆర్. విజయ భాస్కర రెడ్డి,** పులకుర్తి గ్రామం, కర్నూలు జిల్లా.

**విజయ భాస్కర రెడ్డి గారూ,**

మీరు మన పల్లెసృజన ద్వారా వెలుగులోకి వస్తున్న పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, యంత్రాల మీద మంచి అవగాహన కలిగినందుకు కృతజ్ఞతలు. మీరు ఇచ్చి సలహా మాలో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నది. మీ సూచనలు తప్పకుండా ఆచరణలో పెట్టేందుకు తప్పక ప్రయత్నిస్తాము. పల్లెసృజన కోరుకునేది కూడా ఈ పరికరాలు, ఇతర ఇన్నోవేషన్లు విస్తృతంగా సమాజానికి చేరాలన్నదే మనందరి తపన. మంచి సూచన చేసినందుకు ధన్యవాదములు. **– వీరరాఘవ రెడ్డి,** పల్లెసృజన.

**వీరరాఘవ రెడ్డి గారికి,**

మీరు పల్లెసృజన ద్వారా వెలుగులోకి తెచ్చి మాకు అందించిన 'స్మైతి కొడవలి + గొడ్డలి' పరికరం చాలా బాగా పని చేస్తోంది. మేము పామాయిల్ చెట్ల సాగు చేస్తుంటాను. ఎన్నో సంవత్సరాలుగా పామాయిల్ చెట్ల యొక్క పండిన కొమ్మలను, పండ్ల గెలలను తెంపటానికి ఎన్నో రకాల పరికరాలు ఉపయోగించాము. కానీ, వాటితో చాలా కష్టపడవలసి వచ్చేది, ఎక్కువ శ్రమ పడాల్సి వచ్చేది. ఈ స్మైతి పరికరం ద్వారా మా పని చాలా సులభతరం కావడమే కాక, పని కూడా చాలా త్వరగా అయిపోతుంది. ఒక మంచి పరికరాన్ని మాకు అందించినందుకు ధన్యవాదములు. నేను పామాయిల్ చెట్ల పెంపకం దారుల సంఘం తరుపున కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంటాను. కాబట్టి మా రైతులందరికి ఈ స్మైతి పరికరం యొక్క వివరాలను తెలియజేసి, అందరు రైతులు వినియోగించుకునేందుకు తప్పక సహకరిస్తాను. **– కృష్ణారెడ్డి,** మహబూబాబాద్.

**కృష్ణారెడ్డి గారు,**

ధన్యవాదములు. పామాయిల్ వ్యవసాయదారులకు ఒక మంచి పరికరం పరిచయం చేశామన్న తృప్తి మాకు అందించారు. మీ తోటి రైతులకు శ్రమ, సమయం ఆదా అవుతున్నందుకు సంతోషంగా ఉంది. **– వీరరాఘవ రెడ్డి,** పల్లెసృజన.

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

శతకోటి వందనాలతో వ్రాయునది. నా పేరు భీమలింగయ్య, మాది దుద్దేకుంట గ్రామం, బెళుగుప్ప మండలం, అనంతపురం జిల్లా. ఫోన్ నెం. 98863 02717. అనంతపురం జిల్లా దేశంలోనే అతి తక్కువ వర్షపాతం పడే జిల్లా. ఈ జిల్లాలోని అత్యుత్తమ పంటలను పండించాలని కొంతమంది రైతులము నిర్ణయించుకున్నాము. మన భూమిలో పండిన పంటలలోని మంచి విత్తనాలు మరలా వేస్తున్నాము. కొంతమందిమి పాటిస్తున్నాము. విత్తనాలు తయారు చేసే సంస్థలతో మేము ఒప్పందం చేసుకుని స్థిరాదాయం పొందాలని ఆశిస్తున్నాము. అటువంటి కంపెనీల చిరునామా గానీ, ఫోన్ నెంబరు కానీ మాకు పంపి, వారితో అనుసంధానం చేయ గలిగితే అద్భుతాలు చేయగలమని అనుకుంటున్నాము. ఇందుకొరక 'పల్లెసృజన' సహకరించాలని మా మనవి. **– భీమలింగయ్య,** అనంతపురం జిల్లా.

**భీమ లింగయ్య గారూ,**

దీనికి కొరకు మీరు పల్లెసృజనను సంప్రదించినందుకు కృతజ్ఞులం. మీ ఆలోచన చాలా బాగుంది. త్వరలోనే మిమ్మల్ని విత్తన ఉత్పత్తిదారుల సంస్థలతో సంధానం చేస్తాం. ఈ విషయంలో మీకు ఎటువంటి సహాయం కావాలన్న పల్లెసృజనను తప్పక సంప్రదించండి **– బ్రిగేడియర్ గణేశం.**

# పర్‌ఫెక్ట్



ఇన్నోవేటర్
**సంగబోయిన వెంకటకృష్ణ**
నంద్యాల జిల్లా,
ఆంధ్రప్రదేశ్

## త్రిప్స్ నుండి మిరప పంటను కాపాడుతున్న సేంద్రియ పురుగు మందు

'మిరప' రైతులను ఈ సంవత్సరంనిలువునా ముంచిన పూత లోపలి పురుగును శాస్త్రవేత్తలు ఇప్పటికి కనుగొని దానికి 'త్రిప్స్ పార్విస్పైనస్' అని పేరు పెట్టారు. కానీ, గత సంవత్సరం వేలాది ఎకరాల్లో మిరప పంట నాశనం అయింది. చాలా ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంటను దున్ని వేశారు రైతు సోదరులు. కానీ, 'పల్లెసృజన' వెలుగులోకి తెస్తున్న ఇన్నోవేషన్లను నమ్మగలిగిన రైతులు మాత్రం ఈ నమన్యను విజయవంతంగా ఎదుర్కొని తమ పంటను కాపాడుకోగలిగారు.

ఈ 'పర్‌ఫెక్ట్' అనే మూలికా పురుగు మందు పంటపై పిచికారి చేసే ముందు పూతలో నుండి 10-12 సన్నటి నల్లగా వున్న పురుగులు బైటకు వస్తూ కనిపించేవని, 'పర్‌ఫెక్ట్' పిచికారి చేసిన 3-4 రోజుల తర్వాత 2-3 పురుగులు మాత్రమే కనిపించాయని, ఒక వారం తర్వాత మళ్ళీ పిచికారి చేస్తే మొత్తం పురుగులు కనిపించకుండా పోవటమే కాక, పంట చాలా ఆకర్షణీయంగా పెరిగి, మళ్ళీ ఆరోగ్యంగా కనిపించిందని, ఉభయ తెలుగు రాష్ట్రాల రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.











# స్టాప్

## త్రిప్స్ నుండి మిరప పంటను కాపాడుతున్న సేంద్రియ పురుగు మందు


ఇన్నోవేటర్
**సంగబోయిన వెంకటకృష్ణ**
నంద్యాల జిల్లా,
ఆంధ్రప్రదేశ్

గత 4 సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రల్లో మిరప పంటను 'ఆకు ముడత' (బొబ్బర/ జెమిని వైరస్) ఆశించి పంటను నష్టపరుస్తోంది. వేలాది రూపాయల డబ్బు ఖర్చు చేసి, ఎన్ని రకాల రసాయన మందులు పిచికారి చేసినా ఆ తెగులు నయం కాక వేలాది ఎకరాల్లో చేతికి వస్తున్న మిరప పంటను దున్నేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని జిల్లాల్లో జరుగుతోంది. దయచేసి చేతికి రాబో తున్న పంటను తీసివేసి నష్టపోకండి.

'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన 'స్టాప్' అనే మందు రెడుసార్లు పిచికారి చేస్తే వైరస్ అంతా పోయి, మంచి దిగబడి కూడా వచ్చినట్లు దాదాపు ఈ మందు వాడిన రైతులు అందరూ తెలియజేశారు. కొందరు పురుగు మందుల వ్యాపారం చేసే రైతులు కూడా మావద్ద వున్న ఎన్నో రకాల మందులు ఉపయోగించినా బొబ్బర తెగులు తీసివేయలేక పోయింది. కానీ, మీరు అందించిన మందు వల్ల చాలా బాగా ఫలితం వచ్చింది అని తెలియేశారు.

కాబట్టి రైతులందరికీ "పల్లెసృజన" చేస్తున్న విజ్ఞప్తి ఏమంటే. దయచేసి మీ పంటను తీసివేయకుండా ఒక్కసారి ఈ సేంద్రియ పురుగు మందులను వాడి చూడండి, మీ పంటను ఆశించిన జెమని వైరస్ నివారణతో పాటు, మంచి దిగుబడి కూడా సాధించవచ్చు.






PALLE SRUJANA Telugu Bi-monthly July-August 2024 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?


ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్సయాప్‌లో పంపండి.

### సభ్యత్వ వివరాలు (ఒక సంవత్సరానికి)

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| మామూలు పోస్టు ద్వారా | 200/- | 1000 |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 320/- | 1120/- |